ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 10 ఆగస్టు 2025



నోటుకు వేలాయె..!

- పులివెందులలో ఓటుకు ఎంత ఇచ్చేందుకైనా వైసీపీ రెడీ
- ఒంటిమిట్టలో రూ.2వేలు వంతున పంపిణీ షురూ
- పులివెందుల, ఒంటిమిట్టలో మంత్రుల ప్రచారం
- బెంగళూరు కేంద్రంగా వైసీపీ వ్యూహ రచనలు
- నేటితో ప్రచారానికి తెర



జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు జరిగిన ఏడాది తర్వాత పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఉపఎన్నికలు సాగుతున్నాయి. ఇవి ఉప ఎన్నికల మాదిరి లేవు. అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లాగా ఇరుపార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఆదివారం సాయంత్రంతో ప్రచారానికి తెరపడనుంది. దీంతో శనివారం పులివెందుల, ఒంటిమిట్టల్లో టీడీపీ, వైసీపీ విస్తృతంగా ప్రచారం చేశాయి. ఈ ఎన్నికలను ప్రతిష్టగా తీసుకున్న వైసీపీ ఓటుకు ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. పులివెందులలో అయితే ఓటుకు రూ.10 వేలు కూడా ఇచ్చేందుకు సిద్ధమైందని, అయితే టీడీపీ ఎంతిచ్చినా సరే అంతకన్నా అదనంగా రూ.2 వేలు ఇవ్వాలంటూ బెంగళూరు నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెబుతున్నారు. ఇక ఒంటిమిట్టలో ఓటుకు రూ.2 వేలు వంతున పంపిణీ మొదలు పెట్టారని సమాచారం.

కడప, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికలలో ఉమ్మడి జిల్లాలో ఏడు అసెంబ్లీ సీట్లు కోల్పోయింది. ఏడాది తర్వాత జగన్ సొంత జిల్లాలో జరిగే ఉప ఎన్నికలో ఓడిపోతే రాష్ట్రంలో పెద్ద మైనస్ అవుతుంది. అందుకే ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు. దీంతో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలను వైసీపీ జీవన్మరణ సమస్యగా తీసుకుంది. బెంగళూరు నుంచి అందిన ఆదేశాల మేరకు ఎంపీ అవినాశ్‌రెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, మేయర్ సురేశ్‌బాబు, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన ముఖ్యనేతలు పులివెందులలో తిష్టవేశారు.

వందరోజుల్లో హామీల అమలు

పులివెందుల జడ్పీటీసీని ఇంతవరకు టీడీపీ గెలుచుకోలేదు. అయితే తొలిసారి వైసీపీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. బీటెక్ రవి సతీమణి లతారెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ కూటమి ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఆర్.మాధవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సమిష్టిగా టీడీపీ గెలుపునకు శ్రమిస్తున్నారు. శనివారం అనకాపల్లె ఎంపీ సీఎం రమేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పులివెందులలో రోడ్‌షో నిర్వహించారు. టీడీపీని గెలిపిస్తే ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లోనే నెరవేరుస్తామంటూ గట్టిగా హామీ ఇచ్చారు. ముఖ్యంగా యర్రబల్లె చెరువుకు నీళ్లు వస్తే చుట్టుపక్కల పది గ్రామాలకు సాగు, తాగునీరు వస్తుంది. దానిని జగన్ హయాంలో పట్టించుకోలేదు. పెండింగ్ పనులు ఈనెలాఖరు లోపు పూర్తి చేసి నీరు ఇస్తామని సభాముఖంగా మంత్రితో సహా అందరూ హామీ ఇచ్చారు. వైసీపీ నుంచి వరుస చేరికలతో టీడీపీ నేడు బలంగా కనిపిస్తోంది.

ఒంటిమిట్టలో వైసీపీ నుంచి టీడీపీలోకి..

ఒంటిమిట్టలో శనివారం టీడీపీ విస్తృత ప్రచారం నిర్వహించింది. మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఫరూక్, ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు, ఇతర టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. ఒంటిమిట్ట ఎంపీపీ లక్ష్మిదేవి, ఉపాధ్యక్షులు గీతాదేవి టీడీపీలో చేరారు. వైసీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, పెన్నపేరూరు గ్రామానికి చెందిన సుమారు వంద మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే మల్లకాటుపల్లెకు చెందిన వైసీపీ నేతలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పెద్దఎత్తున టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ కొట్టినట్లు చెబుతున్నారు. దీంతో ఓటర్లకు శనివారం నుంచే వైసీపీ రూ.2వేల చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం.

ఓటుకు ఎంతైనా ఓకే

పులివెందుల జడ్పీటీసీ పరిధిలో 10,560 ఓట్లు ఉన్నాయి. ఇక్కడ ప్రతి ఓటు కీలకం. ఈ స్థానాన్ని గెలుచుకుని రావాలని ఇటీవల టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇది వైసీపీలో వణుకు పుట్టిస్తోంది. అందుకే ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. వైసీపీ అయితే పల్లెల్లో ఓటుకు రూ.10వేలు ఇచ్చి అయినా కొనుగోలు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. టీడీపీ కూడా వైసీపీ స్థాయిలోనే ఇచ్చేందుకు సిద్ధమైనట్లు చర్చ నడుస్తోంది. అయితే .. టీడీపీ ఎంతిచ్చినా సరే అదనంగా రూ.2వేలు ఇవ్వాలని బెంగళూరు నుంచి ఆదేశాలు చేరడంతో పంపిణీలో వైసీపీనే పైచేయి సాధించేలా ఉంది. నేటితో ప్రచారం ముగియనుంది. ప్రచారం ముగిశాక ఎన్నికలు జరిగేరోజుకు మధ్యలో ఉండే సమయమే పంపకాలకు కీలకం. ఏదిఏమైనా టీడీపీ, వైసీపీ ఈ ఉప ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని చావోరేవో అనేలా తలపడుతున్నాయి.

ఒంటిమిట్ట అభివృద్ధి కూటమితోనే సాధ్యం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి




చేనేతలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని కొత్తమాధవరంలో చేనేత కార్మికులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలు అంటే కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ప్రేమ ఉందన్నారు. అలాంటి నేతలు ఉన్న మాధవరంలో ఉన్న సమస్యలను పరిష్కరించడం మా బాధ్యత అన్నారు. మాధవరంలోని చేనేత కార్మికుల సమస్యలు ప్రతి ఒక్కటి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అంతకుముందుగా చేనేత కార్మికులు రాష్ట్ర మంత్రికి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కదిరి శాసనసభ్యుడు కందికుంట ప్రసాద్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, స్థానిక నాయకులు నామాల వెంకటయ్య, చంద్ర, నాయకులు, పాల్గొన్నారు.

మండలంలో మంత్రుల విస్తృత ప్రచారం

మండలంలో మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, ఫరూక్‌లు శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. కుడుమలూరు, ఒంటిమిట్టలోని ముస్లిం కాలనీలో శనివారం రాత్రి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర మైనార్టీ నాయకుడు అమీర్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, నాయకులు కొమరా వెంకటనరసయ్య, వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, ఈశ్వరయ్య, డాక్టర్ జిలానీబాషా, పత్తి సుబ్బరాయుడు, పత్తి కృష్ణయ్య, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బసినికొండ పైకి పెద్దసంఖ్యలో మెట్లు ఎక్కుతున్న భక్తులు



కొండపై పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి

బసినికొండ కిటకిట...

మదనపల్లె టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా మదనపల్లె మండలం బసినికొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం ఉదయం నుంచే వాతావరణం చల్లగా ఉండటంతో పట్టణానికి తూర్పున ఉన్న బసినికొండపైకి భక్తులు కాలినడకన ఎక్కారు. సుమారు 1000కి పైగా మెట్లు ఉన్న ఈ కొండపైకి భక్తులు, చిన్నారులు, యువత అలసిపోకుండా మెట్లు ఎక్కి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. బసినికొండ గ్రామ ప్రజలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం రెండో శనివారం కావడంతో ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, అనంతరం స్వామి వారిని వివిధ రకాల పూలతో అలంకరించి అర్చకులు పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, వరద, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా పౌర్ణమి రోజున నిర్వహించే సీతారాముల కల్యాణంలో భాగంగా శనివారం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్‌లు మూలవిరాట్‌లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి పట్టువస్త్రాలను ధరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణవేదికపై ఆసీనులను చేసి మాంగళ్యధారణ కార్యక్రమం నిర్వహించారు. శ్రావణ మాసం పౌర్ణమి కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి సీతారాముల కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులపై అవగాహన

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సంస్కృతి హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి హక్కుల పరిరక్షణ అనే ఉద్దేశాలను ప్రజలందరూ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించినప్పుడే ఆదివాసీలకు హక్కులను కల్పించారన్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు సంబంధించిన పథకాలు, హక్కులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజస్విని మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీల సంస్కృతి, వారి సంప్రదాయాన్ని గుర్తించడానికి 1994లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గుర్తించిందన్నారు. ఆదివాసీలు పర్యావరణ పరిరక్షణకు, సేంద్రియ వ్యవసాయానికి, అవుల పరిరక్షణకు ఎంతో కృషి చేశారని తెలిపారు. వేడుకల్లో డీఆర్‌వో మదుసూదన్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజస్విని, సిబ్బంది, రైల్వేకోడూరు జడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, గిరిజన నాయకులు, గిరిజన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

- ఎక్సైజ్ ఈఎస్ మధుసూదన్



భవన నిర్మాణ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

రాయచోటిటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద భవన నిర్మాణ కార్మికులకు మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం తాగడం వలన ఆరోగ్యం క్షీణించడమే కాకుండా కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయన్నారు. మద్యానికి బానిసలైతే కష్టపడి సంపాదించిన సొమ్ము దుర్వినియోగం కావడమే కాక కుటుంబాలు వీధినపడతాయన్నారు. మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా తయారు చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ అధికారి జోగేంద్ర, డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, మానవతా సభ్యులు సహదేవరెడ్డి, ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్, ఎస్ఐ హుస్సేన్‌బాషా, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు

- బద్వేలు-కడప మధ్య రాకపోకలకు అంతరాయం




కడప- బద్వేలు రహదారిలోని సాహెబ్ బావి వద్ద కూలిన కల్వర్టు

సిద్దవటం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బద్వేలు-కడప రహదారిలోని సిద్దవటం దాటాక అటవీ ప్రాంతంలోని సాహెబ్ బావి వద్ద శనివారం మధ్యాహ్నం కల్వర్టు ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కడప నుంచి బద్వేలు, పోరుమామిళ్ల, ఉదయగిరి, నెల్లూరు ప్రాంతాలకు ఇదే దారిలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టు కూలిపోయిన విషయం తెలియక అటు ద్వేలు వైపు నుంచి ఇటు కడప వైపు నుంచి వెళ్లిన వాహనాలు అడవి మధ్యలో నిలిచిపోయాయి. ఆర్ అండ్ బీ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కల్వర్టు కూలిపోయిందని పలువురు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు రహదారులపై దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరారు. కాగా.. కూలిపోయిన కల్వర్టు వద్దకు ఆర్ అండ్ బీ అధికారులు, పోలీసులు చేరుకుని రాత్రి 7.30గంటల వరకు శ్రమించి కల్వర్టుకు సమీపంలో ద్విచక్ర వాహనాలు, కార్లు వెళ్లేందుకు తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి ఇతర వాహనాలు కూడా వెళ్లేలా పనులు చేపడతామన్నారు.

పింఛా జలాశయంలో వరద నీరు


- ప్రాజెక్టులో 0.21 టీఎంసీలు



సుండుపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పింఛా జలాశయంలోకి వరద నీరు చేరినట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ శనివారం తెలిపారు. గురువారం నుంచి పడిన వర్షాలకు అటవీ ప్రాంతం, ప్రాజెక్టు పైప్రాంతాల నుంచి వర్షపు నీరు రావడంతో ప్రాజెక్టులో 0.21 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. అలాగే పై ప్రాంతాల నుంచి 12 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతున్నట్లు తెలిపారు. ఈసారి పింఛా ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యంతో నిండే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పైభాగంలో పడిన వర్షాలు ప్రాజెక్టు దిగువ భాగంలో ఉండే రైతులకు ఉపయోగపడుతుంది. ప్రాజెక్టులో నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నేళ్లీ నిరీక్షణ?

- ఆగిన నల్లరాతిమడుగు ప్రాజెక్టు పనులు
- ప్రాజెక్టు పనుల్లో పురోగతి శూన్యం
- రైతులకు భూపరిహారం చెల్లింపుల్లో పరిహాసం



నల్లరాతిమడుగు ప్రాజెక్టు పునాది తీసిన ప్రాంతంలో వృథాగా పోతున్న వర్షపునీరు



కంపచెట్లతో నిండిన కాలువ

పెద్దమండ్యం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పెద్దమండ్యం ప్రాంతంలోని వ్యవసాయ భూములు సస్యశ్యామలం చేయడానికి ఏడేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.7 కోట్ల నిధులతో పెద్దమండ్యం గ్రామ పరిధిలోని గెల్లంవారిపల్లి సమీపంలోని కుషావతి నదిపై నల్లరాతిమడుగు ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టింది. అనంతరం ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టు గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రాజెక్టు పనులు చేపట్టిన మొదట్లో రైతులకు భూపరిహారం చెల్లింపులు చేయకుండానే కొంతమేర ప్రాజెక్టు మొదటి దశ పనులు పూర్తి చేశారు. అయితే భూపరిహారం చెల్లించిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేయాలని బాధిత రైతులు అడ్డుకున్నారు. ప్రాజెక్టు నీటి ముంపు ప్రాంత భూముల గుర్తింపునకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి రైతులకు నచ్చచెప్పారు. ఈ క్రమంలో మరోపక్క ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ సిమెంట్ పనులు చేపట్టారు. దీంతో ఆగ్రహించిన రైతులు భూపరిహారం చెల్లించిన తరవాతే నిర్మాణ పనులను చేయాలని అడ్డుకొని పనులను అప్పట్లో ఆపేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనుల్లో పురోగతి కనిపించలేదు. అప్పట్లో దాదాపు రూ.3.5 కోట్ల నిధులు వినియోగించినట్లు సమాచారం. ఈ నిధులు నేలపాలు కాగా ప్రాజెక్టు మట్టి దిమ్మెలతో ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో పనులు చేసిన కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేశారు కానీ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు భూపరిహారం ఎందుకు ఇవ్వలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పెద్దమండ్యం, గెల్లంవారిపల్లి, పెద్దకురవపల్లి, చిన్నకురవపల్లి, చెరువుకిందపల్లి, రెడ్డివారిపల్లి, బిక్కావాండ్లపల్లి, కలిచెర్ల, కోటకాడపల్లి, తాటిమాకులపల్లి తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడంతో పాటు కాలువల ద్వారా సాగునీరు అంది భూములు సస్యశ్యామలం అవుతాయని రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణ అభివృద్ధి పనుల నివేదికను అధికారులు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ప్రభుతం చర్యలు తీసుకుని నల్లరాతిమడుగు ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తాం

నేను ఇటీవల విధుల్లోకి వచ్చాను. 2016-17లో నల్లరాతిమడుగు ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. ప్రాజెక్టు నిర్మాణ అభివృద్ధి పనులకు తాజాగా పెరిగిన మెటీరియల్ కాస్ట్, భూపరిహారం కోసం గతంలో నివేదికలు పంపించారు. గత ప్రభుత్వంలో ఏమి చేయలేదు. ఇంకా భూసేకరణ చేయాల్సి ఉంది. త్వరలోనే నల్లరాతిమడుగు ప్రాజెక్టు పనుల వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం.

-సురేష్‌బాబు, ఈఈ, ఇరిగేషన్, మదనపల్లి డివిజన్

మత్తులో తూలుతున్న బాలురు

టైర్లకు పంచర్లు వేసే సొల్యూషన్‌ను పీల్చి అనారోగ్యం పాలవుతున్న వైనం




సైకిల్‌కు పంచర్లు వేసే సొల్యూషన్, సొల్యూషన్‌ను గుడ్డలో వేస్తున్న చిన్నారులు

రైల్వేకోడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొందరు బాలురు మత్తులో తూలుతున్నారు. సైకిల్ టైర్ల పంచర్లకు వేసే సొల్యూషన్‌ను పీల్చి అనారోగ్యానికి గురవుతున్నారు. వీధుల్లో పారేసిన ప్లాస్టిక్, ఇనుప సామాన్లను సేకరించి వాటితో వచ్చే డబ్బుతో సొల్యూషన్ తీసుకుని పీల్చి మత్తు లోకి జారుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు పట్టణంలో కొందరు అనాథ పిల్లలు ఉన్నారు. వీరు పాఠశాలలకు వెళ్లరు. నిత్యం బయట లభించే పాత సామాన్లు సేకరించి వాటిని అమ్మి టైర్లకు పంచర్లు వేసే సొల్యూషన్‌ను కొనుక్కుని దానిని ఒక గుడ్డలో పలుచగా చేసి నలిపి ముక్కు, నోటి దగ్గర పెట్టుకుని పీల్చుతున్నారు. దీంతో పీల్చిన పది నిమిషాలకు మత్తు వస్తుంది. ఆ మత్తులో వారు ఏమి చేస్తారో వారికే తెలియని పరిస్థితి నెలకొంటోంది.

కొంతమందికి తల్లిదండ్రులు లేక ఇలాంటివి చేస్తుండగా మరికొంత మంది తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్ మనీతో మత్తు పదార్థాలకు బానస అవుతున్నారు. ఇదే కాకుండా వైట్‌నర్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. ఇవి చాలా తక్కువ ధరకు మార్కెట్‌లో లభిస్తుండటంతో వాటిని వినియోగిస్తున్నారు. చేతిలో డబ్బులు లేని సమయంలో పిల్లలు కత్తితో శరీరంపై గాట్లు పెట్టుకుంటున్నారు. చాలామంది పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఇలాంటి పనులకు అలవాటు పడి మత్తులో ఉంటున్నారు. కొంతమందికి తల్లిదండ్రులు ఉన్నా పట్టించుకోవడం లేదు. చక్కగా చదువుకోవాల్సిన పిల్లలు మత్తుకు అలవాటుపడి తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారు. దీనిపై సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకుని చిన్న పిల్లల ప్రాణాలను కాపాడి వారికి విద్యా బుద్ధులు చెప్పించి ప్రయోజకులు తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

వైదులు ఏమంటున్నారంటే...

సైకిల్ టైర్లకు పంచరు వేసే సొల్యూషన్ పీల్చితే గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు బాగా దెబ్బతింటాయని రైల్వేకోడూరు ప్రభుత్వ డాక్టర్ సాయి తెలిపారు. సొల్యూషన్‌తో ముందు గా ఊపిరితిత్తులు, తర్వాత గుండె, కిడ్నీలు దెబ్బతింటూపోతాయని వివరించారు. చిన్నపిల్లలు మత్తుకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. సొల్యూషన్‌లో పూర్తిగా కెమికల్ ఉంటుంది కాబట్టి వాటిని పిల్లలకు మార్కెట్‌లో అమ్మరాదని చెప్పారు.

చర్యలు తీసుకుంటున్నాం

మత్తుకు అలవాటుపడిన చిన్నపిల్లల సమాచారం తెలుసుకుని గుర్తించి వారిని కడప చిన్న పిల్లల సంరక్షణ కేంద్రానికి తరలించి అన్ని వసతులు కల్పించి వారికి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నాము. కలెక్టర్ల ఆదేశాలతో చిన్న పిల్లల బాధ్యతను తీసుకుంటున్నాము. ఇప్పటికే రైల్వేకోడూరులో మత్తుకు అలవాటుపడిన పిల్లలను గుర్తించాము. విద్య, రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖల అధికారులతో రైల్వేకోడూరు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పిల్లలను గుర్తిస్తున్నాము.

- జిల్లా బాలల సంరక్షణ అధికారి రామలక్ష్మీ

పిడుగుపాటుకు 47 జీవాలు మృతి

● సుమారు రూ.6 లక్షల నష్టం ● టీడీపీ నేత చంద్ర రూ.50 వేల ఆర్థికసాయం




మృతి చెందిన గొర్రెలు, పొట్టేళ్లు - బాధితురాలికి రూ.50 వేల చెక్కును అందచేస్తున్న టీడీపీ నేత దేరంగుల చంద్ర

తంబళ్లపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు 47 మూగ జీవాలు మృతి చెందిన సంఘటన తంబళ్లపల్లె మండలం బోనాసివారిపల్లెలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు..తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండా పంచాయతీ బోనాసివారిపల్లెకు చెందిన మావెళ్ల రెడ్డమ్మ భర్త అంజనప్ప కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో ఆమె 110 వరకు గొర్రెలు, పొట్టేళ్లు మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రోజు ఎప్పటిలాగానే జీవాలను మేతకు తీసుకువెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటి వెనుక వైపు రేకుల షెడ్డులో తోలింది. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. శనివారం ఉదయం షెడ్డు వద్దకు వెళ్లి చూడగా కొన్ని జీవాలు పడిపోయి ఉండటం గమనించింది. వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులతో వెళ్లి పరిశీలించగా అందులో 47 జీవాలు మృతి చెందగా, మరో 7 జీవాలు లేవకుండా పడిపోయి ఉన్నట్లు వాపోయింది. మృతి చెందిన జీవాల విలువ సుమారు రూ.6 లక్షల పైగా ఉంటుందని బాధితురాలు వాపోయింది.

బ్యాంకులో బంగారు పెట్టి కొంత, స్థానిక రైతుల వద్ద మరి కొంత అప్పు చేసి జీవాలు తెచ్చుకుని మేపుకుంటున్నామని..ఈ ఘటనతో తాము ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా జీవనోపాధి కోల్పోయామని రెడ్డమ్మ, కుటుంబసభ్యులు భోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకుని తమకు సాయం అందించాలని బాధితులు, స్థానికులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న పశు వైద్య శాఖ ఏడీ సుమిత్ర, పశు వైద్యాధికారి విక్రమ్ రెడ్డి, పశు వైద్యురాలు ఇందు వెంటనే గ్రామానికి వెళ్లి మృత్యువాత పడ్డ జీవాలను పరిశీలించారు. కొన్నింటికి పోస్టుమార్టం నిర్వహించి అవయవాలను పరిశీలించారు. కాలేయం, గుండె తదితర అవయవాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. పిడుగుపాటుకు గురై జీవాలు మృతి చెంది ఉండవచ్చని పశువైద్యాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న తెలుగు యువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, కూటమి నేతలు గ్రామానికి చేరుకుని టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు చంద్ర తన సొంత నిధులు రూ.50 వేల చెక్కును బాధితురాలికి అందచేశారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ఉత్తమ్‌రెడ్డి, సిద్దమల్ రెడ్డి, గ్రామాధ్యక్షులు నరసింహులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, గురుమూర్తి, వార్డు సభ్యులు జగదీష్, జనసేన నేత ఎద్దుల నరసింహులు తదితరులు ఉన్నారు.

ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన నీటి పంపింగ్

పీలేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే క్రమంలో శనివారం పీలేరు పంచాయతీ అధికారులు మరో ముందడుగు వేశారు. కొంత కాలంగా అనేక ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి శనివారం సాయంత్రం నుంచి పీలేరు మండలం బాలంవారిపల్లె వద్దనున్న గార్గేయ ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు.

తొలి విడతలో ఒక మోటారు ద్వారా నీటిని పంపింగ్ చేసి కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లలో నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందిస్తామని డిప్యూటీ ఎంపీడీఓ లతీఫ్ ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో మరో మోటారును కూడా అమర్చుతామని, తద్వారా రెండు, మూడు రోజులకు ఒకసారి పట్టణంలో నీటి సరఫరా చేయగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేనందున ప్రస్తుతం పట్టణంలో సగటున ఎనిమిది రోజులకు ఒకసారి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లు, ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సంయుక్తంగా శ్రమించి మోటారు ద్వారా పంపింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మికులు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రాజెక్టులోకి మోటారు దించుతున్న కార్మికులు, అధికారులు

చికిత్స పొందుతూ మహిళ మృతి



శాంతమ్మ(ఫైల్)

ములకలచెరువు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బైక్‌లో చీర కొంగు ఇరుక్కుని తీవ్రంగా గాయపడిన శాంతమ్మ(45) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. స్థానిక ఇందిరాకాలనీ వాసి పెయింటర్ వెంకటరమణ నాయక్ భార్య శాంతమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈ నెల 7వతేదీన తన కుమారుడు వెంట ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్లింది. అక్కడ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని తిరిగి ములకలచెరువుకు వస్తుండగా మార్గం మధ్యలో వేపూరికోట వద్ద వెనుక కూర్చున్న శాంతమ్మ చీర కొంగు బైక్ వెనుక చక్రంలో చుట్టుకుని కింద పడింది. ఈ ప్రమాదంలో శాంతమ్మ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మహిళ మృతదేహాన్ని ములకలచెరువుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మహిళ మృతితో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ బబ్లూ

ములకలచెరువు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మిస్తున్న కల్యాణమండపంలో పనిచేస్తూ కింద పడడంతో బిహార్ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో యువకుడి రెండు కాళ్ళు విరడగంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు... బిహార్‌కు చెందిన బబ్లూ (31) మదనపల్లెలో నివాసముంటూ భవనాలకు పీఓపీ పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ములకలచెరువులోని కదిరి రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న కల్యాణమండపంలో పీఓపీ పనులు చేసేందుకు వచ్చాడు. శనివారం పనిచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్య సిబ్బంది సూచనల మేరకు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ర్యాలీ చేస్తున్న గిరిజన, యానాది సంఘ నేతలు, సభ్యులు

పీలేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన యానాది సేవా సంఘం, ఏపీ ఆదివాసీ ఎరుకల సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పీలేరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీలేరు ఏఎంసీ ప్రాంగణలో జరిగిన సమావేశంలో ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు జానం గంగిరెడ్డి మాట్లాడుతూ అడవులు, నదులు, పర్వతాలతో కలిసి జీవించిన గిరిజనులు, యానాదులు, ఎరుకల కారణంగా గతంలో పర్యావరణ సమతుల్యత ఉండేదన్నారు. కాలక్రమంలో వారందరూ సంప్రదాయ జీవనశైలికి దూరమైన కారణంగా పర్యావరణ సమతుల్యత గణనీయంగా దెబ్బతినిందన్నారు. ప్రభుత్వాలు తమకు హామీ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను అమలు చేయాలని, అటవీ హక్కులు, విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. అంతకుమునుపు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస వర్మ, మహిళా అధ్యక్షురాలు సావిత్రమ్మ, నేతలు కిల్లా విజయ్ కుమార్, క్రాంతి కుమార్, నారాయణమ్మ, రెడ్డప్ప, ఆదినారాయణ, ఈశ్వరయ్య, లోకేశ్, రాజేశ్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదా ఐఏఎస్

కుటుంబ సభ్యులతో కలిసి రాజంపేటలో వాకింగ్



రాజంపేటలో నడుచుకుంటూ వెళుతున్న సబ్ కలెక్టర్ భావన

రాజంపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఐఏఎస్, ఐపీఎస్‌లు అంటే పెద్ద హుందాతనాన్ని పాటిస్తారు. అయితే మూడు రోజుల కింద రాజంపేట సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యువ ఐఏఎస్ అధికారి భావన ఎంతో సాదాసీదాగా కనిపిస్తున్నారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన మూడో రోజే శనివారం సాయంత్రం రాజంపేట ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి తన కుటుంబసభ్యులతో కలిసి మెయిన్‌రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండు వరకు నడుచుకుంటూ వెళ్లారు. ఆర్టీసీ బస్టాండును సందర్శించి అక్కడ పరిస్థితిని స్వయంగా ఆరాతీశారు. తిరిగి అక్కడి నుంచి నడుచుకుంటూ ఆర్అండ్‌బీ బంగ్లాకు వెళ్లారు. ఇటీవల బదిలీపై వెళ్లిన నిదియాదేవి సబ్ కలెక్టర్ కార్యాలయం ఖాళీ చేయడంలో ఆలస్యమవుతుండడంతో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన భావన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గాలివీడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనంలమేరకు.. మండలంలోని కొర్లకుంట పంచాయతీ పెద్ద రెడ్డివారిపల్లెకు చెందిన నిర్జీ శంకరయ్య (38) రజక వృత్తి, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు, మృతునికి నలుగురు ఆడపిల్లలు సంతానం. కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు కడపలోని రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



సిద్దవటం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భాకరాపేట సమీపంలోని హైవే పక్కన ఉన్న గుర్తు తెలియని వృద్ధురాలు (80) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వృద్ధురాలు హైవే పక్కన పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో ఆమెను కడప రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందింది. ఆమె ఆచూకీ తెలిసినవారు ఒంటిమిట్ట సీఐ బాబు 91211 00581, సిద్దవటం ఎస్ఐ 91211 00584 అనే మొబైల్ ఫోన్ నెంబర్లకు సమాచారం తెలపాలని ఎస్ఐ రఫీ తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీకగా
రాయచోటి నిలవాలి

శాంతి కమిటీ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి రాయచోటి ప్రతీకగా నిలవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి తెలిపారు. ఈ నెల 10న ఆదివారం బీజేపీ సారథ్యంలో నిర్వహించనున్న యాత్రను దృష్టిలో పెట్టుకొని శనివారం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులతో పాటు బీజేపీ నాయకులు, ముస్లిం మత పెద్దలతో చర్చించారు. యాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేయడమే కాకుండా, కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు.

చెట్టును ఢీకొన్న ట్రాక్టర్ : ఇరువురి మృతి

చిన్నమండెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దమండెం ప్రధాన రహదారిలో తొగటపల్లి వద్ద ఒరిస్సాకు చెందిన విద్యుత్ వైర్లు లాగే కూలీల ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు... కరెంట్ స్తంభాలకు వైర్లు లాగేందుకు పులివెందులకు చెందిన మహేశ్ అనే కాంట్రాక్టర్ వద్ద ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుమారు 10 మంది పనిచేస్తున్నారు. శనివారం ఉదయం సంబేపల్లె నుంచి పదిమంది కార్మికులు ట్రాక్టర్‌లో వచ్చి చిన్నమండెం మండలంలోని పడమటికోన, కలిబండ గ్రామ సమీపంలో విద్యుత్ లైన్లు లాగారు. పని పూర్తయిన అనంతరం అందరూ ట్రాక్టర్‌లో సంబేపల్లెకు వెళుతుండగా తొగటపల్లె గ్రామ సమీపంలోని రాగానే ట్రాక్టర్‌కు బ్రేక్ పడకపోవడంతో సాయంత్రం 6.15 గంటలకు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గోల్కాసింగ్ (23), మజీ సింగ్ (25) బలమైన రక్తగాయాలై మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన గోల్కాసింగ్, మజీ సింగ్



చెట్టును ఢీకొన్న ట్రాక్టర్

అన్న క్యాంటీన్‌లో జేసీ భోజనం



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటిటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మాసాపేట మార్కెట్ యార్డులోని అన్న క్యాంటీన్‌ను శనివారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేయడానికి వచ్చిన వారిని భోజనం బాగుందా, సౌకర్యాలు ఎలా ఉన్నాయి, పరిశుభ్రత ఎలా ఉంది వంటి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే భోజనం చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు నాటుతున్న జిల్లా అధికారి ప్రదీప్‌కుమార్

రైల్వేకోడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని భారత యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ (నెహ్రూ యువ కేంద్రం) అన్నమయ్య జిల్లా అధికారి బి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో మై భారత్ సహకారంతో గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుదేవ వశిష్ట కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రధాని అమ్మ పేరుతో ఒక చెట్టు అనే గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రజలు విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం ద్వారా తల్లిలాంటి ప్రకృతిని కాపాడుకున్న వారమవుతామన్నారు. ఇంటి ఆవరణలో పండ్ల మొక్కలు పెంచడం ద్వారా ఇంటి అవసరాల ఖర్చు తగ్గించుకోడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు. మహిళలు ఉపాధిగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి మాట్లాడుతూ పర్యావరణ అసమతుల్యత కారణంగా సమయానికి వర్షాలు పడకపోగా, ఎండలు అధికమవుతున్నాయన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడమే కాకుండా ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలన్నారు. అనంతరం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుదేవ వశిష్ట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్రజున్ను రమేష్, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు శివ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం తాళలేక ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహ్యా చేసుకుంది. కోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు కోడూరు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న యోగానంద సతీమణి ముక్కడి చిన్న రెడ్డమ్మ (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది.

దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె శనివారం ఉరి వేసుకుని మృతి ఆత్మహత్య చేసుకుంది. భర్త ఇచ్చిన సమాచారం మేరకు ఇంటికి వెళ్లి పరిశీలించి మృతదేహని శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలి తల్లి చిన్నక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అన్నదాతకు 'ఆత్మా' చేయూత

● క్రియాశీలకంగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ● శాస్త్రీయ పద్ధతులకు రూ.59.5 లక్షలు



రైతుల్లో అవగాహన పెంచేందుకు బ్యాలెట్ బాక్స్ పరీక్షను నిర్వహిస్తున్న ఆత్మా బ్లాక్ టెక్నాలజీ మేనేజర్



వరిలో కాలిబాటలు తీసే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు సాగులో సాంకేతికతను చేరువ చేసే దిశగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. సాగు రంగానికి సమన్వయంగా రైతన్నలకు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఆత్మాకు మోక్షం లభించింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని గాలికి వదిలేసింది. గడిచిన అయిదేళ్లల్లో ఒక్కపైసా నిధులు చేయకుండా నిర్వీర్యం చేసింది. ఆత్మాను బలోపేతం చేసి వ్యవసాయ రంగ శాస్త్రీయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ఆధునిక సాగు పద్ధతుల విస్తీరణకు కూటమి ప్రభుత్వం ఉమ్మడి కడప జిల్లాకు రూ.59.5 లక్షలు నిధులు మంజూరు చేసింది.

కడప జిల్లాలో 8, అన్నయ్య జిల్లాలో 4 వ్యవసాయ బ్లాక్లుగా కేటాయించారు. మంజూరైన నిధులతో ఆయా అధికారులు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధునాతన సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పెట్టుబడులను తగ్గించడం, నూతన యత్ర పరికరాలు అయిన డ్రోన్ వంటి వాటి గురించి వివరిస్తారు. ప్రధాన పంటల గురించి క్షేత్ర స్థాయిలో ప్రదర్శనలు, విజ్ఞాన యాత్రలు, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనకు మార్కెటింగ్, తెగుళ్లు, చీడ పీడల నివారణ, ఎరువుల యాజమాన్యంపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. ఈ పథకంలోని బ్లాక్ టెక్నాలజీ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రైతులను చైతన్యపరుస్తూ వారిలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నారు. సాగు విధానంలో నూతన ఒరవడిని, అధ్యయనాన్ని వివరిస్తూ అన్నదాతల చైతన్యం కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

రైతన్నకు సాంకేతిక పరిజ్ఞానం

వ్యవసాయ డివిజన్ల పరిధిలో సాగులో ఉన్న రైతులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. రైతుకు ఆధునిక పద్ధతులను వివరిస్తూ సాగు విధానంపై శిక్షణ కల్పిస్తాం. పొలంబడి, విజ్ఞానయాత్ర, కిసాన్‌మేళా తదితర కార్యక్రమాలతో పక్కా కార్యాచరణ ప్రణాళికతో ఆత్మాను ముందుకు నడిపిస్తాం.



\- ఎస్.విజయలక్ష్మి, పీడీ, ఆత్మా

పాలకొండ్రాయ స్వామికి బంగారు నామాల బహూకరణ



బంగారు నామాలను అందజేస్తున్న సగబాల పార్వతమ్మ కుటుంబీకులు

కడప కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన సగబాల పాలకొండ్రాయుడు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పార్వతమ్మ కడప నగరానికి సమీపంలోని పాలకొండపై వెలసిన పాల కొండ్రాయ స్వామికి సుమారు మూడు తులాల బంగారు నామాలను బహూక రించారు. శ్రావణమాస మూడు శనివారం పాలకొండలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగబాల పాలకొండ్రాయుడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు స్వామివారికి సుమారు రూ.4లక్షల విలువైన బంగారు నామాలు, పట్టు వస్త్రాలు ఆలయ ఈవో శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు యోగి ద్వారా అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం





విరాళం అందజేస్తున్న బన్నూరు క్రిష్ణమూర్తి, ముచ్చర్ల శేషయ్య

బ్రహ్మంగారిమఠం ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీమాత ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. శనివారం స్థానిక కన్యకాపరమ్వేరీ అమ్మవారిశాల అధ్యక్షుడు బన్నూరి క్రిష్ణమూరి కుటుంబసభ్యులు రూ.1,00,116లు, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు ఆర్యవైశ్య అన్నదాన సత్రం, అమ్మవారిశాల కమిటీ మెంబర్ ముచ్చర్ల శేషయ్య కుటుంబసభ్యులు రూ.1,00,116లు మఠాధిపతులు వీరశివకుమార్ స్వామికి అందజేశారు. దాతలను శివకుమార్‌స్వామి శాలువ, పూలమాలతో సన్మానించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునగౌడ్

కడప మారుతీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్‌లో గల హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని హరితహోటల్ జిల్లా డీవీఎం మల్లికార్జునగౌడ్ కోరారు. శనివారం స్థానిక హరితహోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల అధ్యాపకులు ఎన్.శివరామకృష్ణ చౌదరితో కలిసి ఆయన మాట్లాడారు. ఇందులో మూడు సంవత్సరాల బీఎస్సీ (హెచ్‌ఎండ్ హెచ్‌ఏ) డిగ్రీ కోర్సులో ఇంటర్‌లో 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇదిలా వుండగా క్రాఫ్ట్ కోర్స్ ఇన్‌ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సు సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్‌కు పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఈ కోర్సులలో 5 నెలలపాటు వివిధ రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి.. ఒక నెల ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారన్నారు. కోర్సుల కాలం పూర్తికాగానే ఏపీ రాష్ట్ర పర్యాటకశాఖ హోటల్స్, ప్రముఖ ఫైవ్‌స్టార్ హోట ళ్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. అర్హులైన యువతీ, యువకులకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం కలదన్నారు. మరింత సమాచారం కోసం 9701343846, 9100558006, 9502113163 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 13వ తేదీ లోపు తిరుపతిలో గల కళాశాలకు పంపించాలని కోరారు.


ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన డీఐవో



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఐవో ఉమామహేశ్వరరావు

కడప కలెక్టరేట్/ బద్వేలు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రవేట్ ఆసుపత్రులను సోమవారం జిల్లా ఇమ్మూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రులలో ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్, పొల్యూషన్, ధరల పట్టికల ప్రదర్శన, నీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, రికార్డులు పరిశీలించారు. ముఖ్యంగా అర్హత గల వైద్య సిబ్బంది ఉన్నారా? లేదా? అనే విషయాలను ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఐవో హెచ్చరించారు.

బద్వేలులో...: పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను శనివారం ఆర్‌బీఎస్‌కే జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రమేష్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు, చెక్‌లిస్ట్‌లో పేర్కొన్న ప్రమాణాల అమలు పరిస్థితిని, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, సూపర్‌వైజర్ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యశాఖ అధికారులు

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ.. తప్పిన ప్రమాదం



కొండాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పట్టణంలో శనివారం ఓ లారీ డివైడర్‌పైకి దూసుకొచ్చింది. లోడుతో తాడిపత్రి వైపునకు వెళుతున్న లారీ ఒక్కసారిగా డివైడర్‌పై దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనాల రాకపోక లు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డివైడర్‌పై ఉన్న బారికేడ్లు, లారీ ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది.

ఉప ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పులివెందులలో 500 మందిపై బైండోవర్ ● ఎస్పీ అశోక్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

పులివెందుల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్పీ వచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీకి ఉప ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా పులివెందుల మండలంలో 9 చోట్ల ఓటింగ్ సాగుతుందన్నారు. ఇక్కడ అవసరమైన అన్ని ఏర్పాట్లను పరిశీలించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా దాదాపు 500మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. రౌడీషీటర్లపై, ఓట ర్లను కావాలనే ఇబ్బంది పెట్టాలనుకునే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం 48 గంటల ముందు ప్రచారాలు ముగించాలన్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు హోటళ్లు, లాడ్జిలలో ఉండేవారిపై వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. వెహికల్స్‌లో తిరిగే వారిపై కూడా వివరాలు సేకరిస్తున్నామన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత ఎన్నికలు జరగడమే ఏకైక లక్ష్యంగా ఏర్పాట్లు సాగించామన్నారు. పులివెందుల మండలంలో తొమ్మిది ప్రాంతాలలో ఓటింగ్ సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలతో భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటింగ్ జరుగుతున్న సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో చిత్రీకరణ, కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కూడా జరుగుతుందన్నారు.

గండి క్షేత్రానికి వెళ్తుండగా.. ఆటోను ఢీకొట్టిన కారు

ఒకరు మృతి... కుటుంబ సభ్యులకు గాయాలు





మృతి చెందిన పుల్లయ్య, నుజ్జునుజ్జు అయిన ఆటో

వేంపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం చేసుకునేందుకు ఓ కుటుంబం గండి క్షేత్రానికి ఆటోలో వెళుతుండగా ప్రమాదం సంభవించి ఒకరు మృతి చెందగా.. మరి కొందరికి గాయాల య్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వెలమవారిపల్లె గ్రామానికి చెందిన గండ్లూరు పుల్లయ్య (55), కుమారుడు వలి, కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం ఆటోలో గండికి బయలుదేరారు. మార్గమధ్యలోని నందిపల్లె సమీపంలో పులివెందుల-వేంపల్లె ప్రధాన రహదారిలో వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఆటోను వేగంగా ఢీకొంది. దీంతో ఆటో చెట్టుకు ఢీకొని నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో పుల్లయ్య తీవ్రంగా గాయపడగా అసుపత్రికి తీసుకెళుతుండగా మృతి చెందాడు. కుమారుడు వల్లి, మనువడు, మనువరాలు నయాన్, మెహరీన్‌లకు గాయాలయ్యాయి. వీరిని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. పుల్లయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో ఉంచారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'గిరిజనులపై దాడికి తెగబడిన అగ్రకులాల వారిని అరెస్ట్ చేయాలి'

కడప మారుతీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బాకీ వున్నారనే నెపంతో వేంపల్లి టౌన్ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గిరిజన (ఎరుకల) కులానికి చెందిన ఎస్. వెంకటలక్షుమ్మతో పాటు ఈమె తల్లి రామలక్షుమ్మలను కారులో బలవంతంగా తీసుకెళ్ళి దాడికి పాల్పడిన వారిని తక్షణం పోలీసులు అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెనుగొండ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎర్రముక్కపల్లెలో గల ఏఐవైహెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామలక్షుమ్మ పెద్ద కుమార్తె గంగాదేవికి రూ.40 లక్షలు అప్పుగా ఇస్తే.. చెల్లించకుండా కాలయాపన చేస్తున్నదంటూ సదరు ప్రాంతానికే చెందిన వరప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, నాగార్జున, వీరి అనుచరులు మహిళలను వారి ఇంటి నుంచి కారులో తీసుకెళ్లి వివిధ ప్రాంతాలలో పది రోజులపాటు చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. కాగా ఆ మహిళలు నివాసం వున్న ఇంటి పేపర్లు, వ్యక్తిగత బాండ్లు, తీసుకువచ్చి తిరిగి ప్రామిసరీ నోట్లపై కుటుంబసభ్యులతో సంతకాలు తీసుకురావాలంటూ హుకుం జారీ చేశారన్నారు. ఈ విషయాన్ని బట్టబయలు చేస్తే చంపేస్తామని బెదిరించడం బాధాకరమన్నారు.

ఈ విషయంపై జిల్లా ఎస్పీకి గత మే నెల 26న ఫిర్యాదు చేశామన్నారు. అంతేకాకుండా రాష్ట్ర హోంమంత్రికి, ట్రైబల్ మంత్రికి రాతపూర్వకంగా ఇచ్చినట్లు స్పష్టం చేశారు. వీరితో పాటుగా వేంపల్లి పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు కాపీని ఇచ్చామన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా వారిపై కేసు నమోదు చేశారే కానీ ఇప్పటి వరకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

ఒకే చోట సీహెచ్‌సీ, పీహెచ్‌సీ

● పల్లెలకు అందని వైద్యసేవలు ● ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలు

చెన్నూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతప్రజలకు వైద్యసేవలు అందని ద్రాక్షలా మారాయి. మండల కేంద్రంలో ఒకేచోట సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో దూర ప్రాంత ప్రజలు వైద్య కోసం రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలైన కైలాసగిరికోన, ఎస్టీ రామాపురం కాలనీ, దౌలతాపురం ఎస్టీ కాలనీ, గుర్రంపాడు ప్రాంత ప్రజలు వైద్యసేవలు పొందాలంటే ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూరులో దాదాపు 60 ఏళ్ల క్రితం ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో మండల జనాభా పెరగడంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చారు. అయితే ప్రతి మండల కేంద్రానికి సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తప్పకుండా నిర్మించాలి. అయితే చెన్నూరులోని విలేజ్ క్లినిక్‌నే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చారు. అంతకు ముందు సామాజిక ఆరోగ్య కేంద్ర భవనంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ఉండేది. వైద్యం కోసం వచ్చిన ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లకుండా సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లడంతో అక్కడ ఓపీ విభాగంలో వత్తిడి ఎక్కువ అయ్యింది. ఎట్టకేలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఈ విషయం వైద్యవిధానపరిషత్‌కు తెలి పి సీహెచ్‌సీ భవన నుంచి పీహెచ్‌సీ భవనాన్ని వేరు చేస్తూ విలేజీ క్లినిక్‌లో పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. అయితే రెండు కూడా మండల కేంద్రంలోనే కొనసాగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాలకు అందని వైద్యసేవలు

మండల కేంద్రంలోనే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఉండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కైలాసగిరి కోన, ఎస్టీరామాపురం కాలనీల ప్రజలు రాత్రివేళ, అత్యవసర పరిస్థితులో దాదాపు ఆరేడు కి.మీ దూరం నుంచి మండల కేంద్రా నికి రావాలంటే.. వారి అవస్థలు వర్ణనాతీతం. వైద్యశాఖ అధికా రులు ఈ విషయం పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోవడంతో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామని చెప్పిన పప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో సీహెచ్‌సీ, పక్క గ్రామాల్లో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.





చెన్నూరులోని సీహెచ్‌సీ భవనం, పీహెచ్‌సీ భవనం

మలేరియా రహిత జిల్లాగా చేద్దాం



సుగాలి బిడికీలో దోమల నివారణ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, వైద్య సిబ్బంది

రామాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాను 2027 నాటికి మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ సచివాలయ పరిధిలో శనివారం దోమల నివారణ (ఏసీయం) స్ప్రేయింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటిలో దోమల నివారణ మందు తప్పనిసరిగా స్ప్రే చేయించు కోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించి దోమల వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో సాయంత్రం వేళల్లో వేపాకు పొగ పెట్టడం వల్ల దోమలను నివారించుకోవచ్చని తెలిపారు. స్ప్రే నిర్వహణపై స్టేట్ కన్సల్టెంట్ కొండారెడ్డి విజయవాడ నుంచి వీడియో కాల్ ద్వారా పర్యవేక్షించి సాంకేతిక సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ క్రిస్టఫర్, ఆశ కార్యకర్తలు, స్ప్రే కాంట్రాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ముత్తుమారెమ్మ గ్రామోత్సవం



ఊరేగుతున్న ముత్తుమారెమ్మ

నందలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ అరవపల్లెలో శనివారం రాత్రి ముత్తుమారెమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన సేలం సురేష్, సేలం సుధాకర్ ఉభయందారులుగా వ్యవహరించారు. ఉదయం బండాత్మకూరు శివశంకర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్నం చెన్నైకి చెందిన నాగరాజు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త సేలం చంద్రశేఖర్ మొదలియార్, శ్రీరామ్ కిరణ్‌కుమార్, నాగరాజు, చెంగల్‌రాయుడు, వెంకటరమణ, దినేష్‌రెడ్డి, మురళీ భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్

సిద్దవటం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఎస్‌కేఆర్ నగర్‌కు చెందిన వెంకటసుబ్బమ్మ శనివారం మాధవరం-1 బంగారుపేటలోని గంగాభవాని ఆలయ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఒంటిమిట్ట నుంచి మిట్టపల్లెకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న చిన్నా అనే వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదుకుంటున్న గొర్రెల పెంపకం

- వర్షాలు లేక బీళ్లుగా మారిన భూములు
- అరకొరగా సాగు చేసిన పైర్లు ఎండిపోయి తీవ్ర నష్టం
- వ్యవసాయంపై ఆశ వదులుకున్న రైతులు

లక్కిరెడ్డిపల్లె, ఆగసు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏళ్ల తరబడి వర్షాలు లేక, అరకొర వర్షాలకు వేరుశనగ సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతులు వ్యవసాయాన్ని పక్కనపెట్టి గొర్రెల పెంపకాన్ని జీవనాధారంగా మలుచుకుంటున్నారు. మండలంలోని అప్పకొండయ్యగారిపల్లె, లక్కిరెడ్డిపల్లె, పాలెంగొల్లపల్లె, బీ. యర్రగుడి, చెంచర్లపల్లి, నల్లగుట్టపల్లె, దప్పేపల్లె, వీరనాగిరెడ్డిపల్లె, నల్లగుట్టపల్లి, కుర్నూతల, బూడిదగుంటపల్లె గ్రామాల్లో షెడ్లు ఏర్పాటు చేసుకొని పొట్టేళ్ల పిల్లలను పెంచుతున్నారు. పగలు బయట మేపుకొని వచ్చి, సాయంత్రం వేళల్లో షెడ్లలో దాణా అందించి మేపుతున్నారు. దీంతో ప్రస్తుతం మండల వ్యాప్తంగా దాదాపు లక్షాయాభై పొట్టేళ్లు పెంచుతున్నట్లు అంచనా . వీటిని పెంచడానికి పలువురు రైతులు బీహార్‌కు చెందిన కూలీలను నియమించుకుంటు న్నారు. 100 పొట్టేళ్లను ఆరు నెలలు మేపితే పెట్టుబడికి రెట్టింపు డబ్బు వస్తోందని, వ్యవసాయం చేసినపుడు నష్టాలే తప్ప లాభాలు ఎప్పుడూ కళ్లజూడలేదని రైతులు ఆరీఫ్, ఓబులేసు, వెంకటన్న చెబుతున్నారు. బీ. యర్రగుడి, పాలెం గ్రామాల్లో అధికశాతం ప్రజలు పొట్టేళ్ల పెంపకమే జీవనాధారంగా మలుచుకున్నారు.



మేతకు వెళుతున్న గొర్రెలు



షెడ్లలో మేస్తున్న పొట్టేళ్ల పిల్లలు

11 బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు



12 ఎకరాల పొలం ఉంది. 10 లక్షలు ఖర్చు చేసి 11 బోర్లు వేశాను. చుక్కనీరు పడలేదు. వర్షాలు కూడా లేకపోవడంతో పంట సాగు చేయలేక వ్యవసాయం వదిలేసినా. ప్రస్తుతం 120 పొట్టేళ్ల పిల్లలను మేపుకుంటున్నాను. ఆరు నెలలకు 20 లక్షల ఆదాయం వస్తోంది.

- రైతు, లక్ష్మీనరసయ్య, బీ. యర్రగుడి

బీళ్లుగా మారిన భూములు

సకాలంలో వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంట చేతికందక ప్రతి ఏటా అప్పులే మిగిలేవి. దీంతో వ్యవసాయాన్ని పక్కన పెట్టి 100 పొట్టేళ్ల పిల్లలను మేపుకుంటున్నాను. జీవనం బాగుంది. వ్యవసాయం నష్టం, పొట్టేళ్ల పెంపకం ఎంతో లాభదాయకంగా ఉంది.

- రమణయ్య, రైతు, పాలెం గొల్లపల్లె

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్

ఒంటిమిట్ట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. శనివారం సాయంత్రం రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు డాక్టర్ జిలానిబాషా ఆధ్వర్యంలో మైనార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, రాష్ట్ర మైనార్టీ నాయకులు అమీర్‌బాబు, జిల్లా నాయకులు హరిప్రసాద్, మైనార్టీ నాయకులు జవహర్‌బాషా, పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, మండల మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

మండల కేంద్రంలోని కల్లావీధి, మాడవీధి, దిగువ వీధుల్లో మండల టీడీపీ నాయకుడు మామిళ్ల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టనున్నారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కడప నియోజకవర్గ నాయకులు అమీర్‌బాబు, రాష్ట్ర టీడీపీ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, రవినాయుడు, జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ, రాజంపేట టీడీపీ నాయకులు ఎద్దల సుబ్బరాయుడు, ఎద్దుల విజయసాగర్, రాష్ట్ర టీడీపీ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, కొమరా వెంకటనరసయ్య, నాయకులు పామూరు సుబ్రమణ్యం, మోదుగుల నరసింహులు, అంగడాల వెంకటసుబ్బయ్య, మామిళ్ల కృష్ణయ్య, రేవిళ్ల బాలమునెయ్య, ఉగ్గురపు వెంకటరమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

ప్రజల చేతిలోనే ఒంటిమిట్ట అభివృద్ధి

రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండల అభివృద్ధి ప్రజల చేతుల్లోనే ఉందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శనివారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు వేసే ఓటు మండల అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని గెలిపించాలన్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. అంతకుముందుగా సీతారాంపురం గ్రామ ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నల్గొండ వెంకటసుబ్బారెడ్డి మోహన్‌రెడ్డి భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సంబేపల్లె: రాజంపేట తెలుగు యువత అధ్యక్షుడు తోపురెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి అశోక్‌చౌదరి శనివారం జెడ్పీటీసీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డితో కలిసి పేరూరు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకుడు ఉత్సాహవంతుడు ప్రజలకు సేవ చేసి మనసున్న వ్యక్తి ముద్దుకృష్ణారెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం సంవత్సరం కాలంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విధానం వివరించారు.

రాజంపేట: రాజంపేట టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, గీతాంజలి రమణ తదితర నేతలు ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె, చింతరాజుపల్లె ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని విన్నవించారు. కోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డితో కలిసి కోడూరు నేతలు ప్రచారంలో పాల్గొన్నారు.

గాలివీడు: గాలివీడు సర్పంచ్ పార్థసారథిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి చెర్లోపల్లి, నడిమిపల్లెలో ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులురాజు, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, వీరరాఘవులు, యువగళం సభ్యులు సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీతారాంపురంలో ప్రచారం చేస్తున్న చమర్తి

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

- 'రీజెన్సీ' అధినేత డాక్టర్ జీఎన్‌నాయుడు

రాజంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రాష్ట్రంలో జిల్లాల ఏర్పాటుపై మంత్రుల ఉప సంఘం నియమించిన సందర్భంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విన్నవించినట్లు సీనియర్ టీడీపీ నాయకులు, రీజెన్సీ సిరామిక్ పరిశ్రమల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు వెల్లడించారు. శనివారం రాజంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డదిడ్డంగా జిల్లాలను విభజించి ప్రజలను ఇబ్బందులపాలు చేశాడన్నారు. రాష్ట్రంలో మదనపల్లెతో పాటు ఏకంగా 17 మండలాలతో రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న రాజంపేటను కేవలం 9 మండలాలకు కుదించారన్నారు. మూడు ఘాట్ రోడ్ల అవతలి వైపు ఉన్న రాయచోటిలో రాజంపేటను కలిపారన్నారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పార్లమెంట్, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉన్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని తాము ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి విన్నవించామన్నారు. ప్రస్తుతం మంత్రివర్గం ఉపసంఘం దీనిపై అధ్యయం చేస్తున్నందు న మరొకసారి రాజంపేట డివిజన్‌లోని ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని దీనిని జిల్లా కేంద్రం చేయాలని మరోసారి విన్నవిస్తామన్నారు. నాలుగేళ్ల కిందట తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును పునరుద్ధరించి ఎగువ, దిగువ ప్రాంతాల రైతులకు నీటివాటాలో ప్రాధాన్యం కల్పించాలన్నారు. గతంలో ఆల్విన్, లోకోషెడ్ పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధి లభించేదన్నారు. ఆ పరిశమలు మూతపడినందున ప్రత్యామ్నాయంగా పండ్లతోటలకు అనుసంధానంగా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీఎంకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు గుడారు సుబ్రమణ్యం నాయుడు, పెంచలయ్య నాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జీఎన్‌నాయుడు

ప్రేమానురాగాలతో రక్షాబంధన్



తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

రైల్వేకోడూరు/సిద్దవటం,ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గంతోపాటు సిద్దవటంలో శనివారం రక్షాబంధన్ (రాఖీ పండుగ)ను పెద్దలు, చిన్నలు ఘనంగా నిర్వహించుకున్నారు. అక్కా చెల్లెళ్లు తమ్ముళ్లు, అన్నలకు రాఖీలు కట్టారు. మిఠాయిలు పంచుకున్నారు. దూరంగా ఉన్న వారు వాట్సాప్‌లో శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు



అన్నదానం చేస్తున్న మంత్రి కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంతో పాటు పందిళ్లపల్లె, దప్పేపల్లెలోని ఆలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా పూజలు నిర్వహించారు. దేవరచలమ ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ ఆలయాల అభివృద్ధి కోసం మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆలయాలు అభివృద్ధి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి యనమల మదన్‌మోహన్, దప్పేపల్లె సర్పంచ్ దాసరి కేశవయ్య, టీడీపీ నాయకులు కృష్ణమోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తిరునాళ్లు



పూజలు చేస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండల కేశాపురం గ్రామ పంచాయతీలోని గుట్టమోటు ఆంజనేయస్వామి తిరుణాల సందర్భంగా శనివారం అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి, మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. టీడీపీ నాయకుడు మూగి రెడెప్ప నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు

రామాపురం: శ్రావణ శనివారం సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రాత్రికి ఆలయాల్లో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త కర్ణపు సుధాకర్‌రెడ్డి తన తండ్రి కర్ణపు ఈశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు నాగభూషణ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, కుటుంబ సభ్యులు, మహిళలు, ప్రజలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని రామస్వామిపల్లె గ్రామ సమీపంలోని పాలకొండలో వెలసిన ఆంజనేయ్యామికి మూడో శ్రావణమాస శనివారం సందర్భంగా స్వామివారికి ఆకు పూజ, ఆంజనేయ, అష్టోత్తరం పంచామృతాభిషేకాలు నిర్వహించామని గ్రామస్థులు తెలిపారు. వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



కల్యాణ వేదికపై లక్ష్మీనరసింహస్వామి

రాజంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ పౌర్ణమి సందర్భంగా మండలంలోని భువనగిరి పల్లె లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం కల్యాణోత్సవం నిర్వహించారు. మలిశెట్టి నారాయణ, లక్ష్మీదేవి, ఆలయ ధర్మకర్తలు, భువనగిరిపల్లె ప్రజలు పాల్గొన్నారు. . ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ, ఆలయ ధర్మకర్తలు టైల్స్ నరసింహ, మాజీ సర్పంచ్ ఎంఎల్ నరసయ్య, ఇతర ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

సౌమ్యనాథ అన్నదాన సేవా ట్రస్టుకు విరాళం



విరాళం అందజేస్తున్న ఆనందాచారి దంపతులు

నందలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సౌమ్యనాథస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న సౌమ్యనాథ సేవా ట్రస్టుకు రాజంపేట కు చెందిన ఉపాధ్యాయుడు శిల్పి ఆచారి, రాజేశ్వరి దంపతులు శనివారం 1,00,116 రూపాయలు అందజేశారు. ఈ మొత్తాన్ని ట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్న స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు మాట్లాడుతూ త్వరలో శుక్ర, శని, ఆదివారాల్లో అన్నదానం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అనంతరం దాతలను శాలువతో సన్మానించారు.

సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



కార్యసిద్ధి వినాయకస్వామి

పెనగలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పి.కొత్తపల్లెనిర్మించిన కార్యసిద్ధి వినాయకఆలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా శనివారం తలమంచి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తలమంచి గిరీశ్‌రెడ్డి సహకారంతో అన్నదానం చేశారు. దేవాలయ నిర్మాణంతో పాటు మూలవిరాట్‌లు సమర్పించుకున్న తలమంచి రమణారెడ్డి, చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, తీర్థ ప్రసాదాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు.పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ సేవలు పేదలకు వరం

- కర్నూలు రేంజి డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

రాజంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చేతన ఫౌండేషన్ సేవలతో రాజంపేట పట్టణంలో నిపేదలకు ఎంతో ఉపయోగమని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. శనివారం రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్ మాట్లాడుతూ తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్ స్ఫూర్తితో చేతన ఫౌండేషన్ వారు రాజంపేట ప్రాంతంలో పేదలకు కుట్టుమెషీన్లు, వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, దివ్యాంగులకు కృత్రిమ పాదాలు, సైకిళ్లు తదితర వస్తువులను పేదలకు పంపిణీ చేస్తున్నారన్నారు.

తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన రాజంపేట ప్రాంతంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వికసిత్ ఫౌండేషన్ సభ్యురాలు లక్ష్మీదేవి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సైకిళ్లు, దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, తోపుడు బండ్లు, కుట్టుమిష న్లు పంపిణీ చేశామన్నారు. రాజంపేట సబ్‌కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, వేమన సతీష్ సతీమణి నీలిమా చనుమోలు, జిల్లా యూత్ అధికారి ప్రదీప్ కుమార్, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ ఆర్వీ కృష్ణకుమార్, బార్లీలియా ఫౌండేషన్ నిర్వాహకులు కేశవ కిషోర్ తదితరులు మాట్లాడుతూ ఇటు వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించిన వేమన సతీష్, నీలిమను అభినందించారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్, సబ్‌కలెక్టర్ భావన, వేమన సతీశ్

జేవీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా రాజశేఖర్, వెంకటరమణ



రాజశేఖర్



వెంకటరమణ

రాయచోటి టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వీరబల్లి హైస్కూల్ టీచర్ రాజశేఖర్, గరుగుపల్లి హైస్కూల్ టీచర్ వెంకటరమణను ఎన్నుకున్నారు. శనివారం కడప పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే. విశ్వనాథ్ ప్రచార కమిటీ సభ్యులు సనావుల్లా ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 6 నుంచి 9 వరకు ప్రపంచ దేశాలకు చీకటి దినాలన్నారు. ఆయా రోజుల్లో జపాన్‌లోని నాగసాకి, హిరోషిమా పట్టణాలపై అణుబాంబు దాడి జరిగిందన్నారు. వీటివల్ల మానవాళి నివసించే పట్టణాలు ఎంతో వేదనకు గురయ్యాయన్నారు. మూర్ఖులు, అశాంతిపరులు, సామ్రాజ్యవాద కాంక్ష కలిగిన వారి చేతుల్లోకి ఇలాంటి అణుబాంబులు వెళ్తే అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భావితరాల కోసమైనా అన్ని దేశాలు అణు పరీక్షలకు దూరంగా ఉండాలని, మంచికి ఉపయోగించాలని పేర్కొన్నారు.

మత్తులో తూలుతున్న బాలురు

టైర్లకు పంచర్లు వేసే సొల్యూషన్‌ను పీల్చి అనారోగ్యం పాలవుతున్న వైనం




సైకిల్‌కు పంచర్లు వేసే సొల్యూషన్, సొల్యూషన్‌ను గుడ్డలో వేస్తున్న చిన్నారులు

రైల్వేకోడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొందరు బాలురు మత్తులో తూలుతున్నారు. సైకిల్ టైర్ల పంచర్లకు వేసే సొల్యూషన్‌ను పీల్చి అనారోగ్యానికి గురవుతున్నారు. వీధుల్లో పారేసిన ప్లాస్టిక్, ఇనుప సామాన్ల ను సేకరించి వాటితో వచ్చే డబ్బుతో సొల్యూషన్ తీసుకుని పీల్చి మత్తు లోకి జారుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు పట్టణంలో కొందరు అనాథ పిల్లలు ఉన్నారు. వీరు పాఠశాలలకు వెళ్లరు. నిత్యం బయట లభించే పాత సామాన్లు సేకరించి వాటిని అమ్మి టైర్లకు పంచర్లు వేసే సొల్యూషన్‌ను కొనుక్కుని దానిని ఒక గుడ్డలో పలుచగా చేసి నలిపి ముక్కు, నోటి దగ్గర పెట్టుకుని పీల్చుతున్నారు. దీంతో పీల్చిన పది నిమిషాలకు మత్తు వస్తుంది. ఆ మత్తులో వారు ఏమి చేస్తారో వారికే తెలియని పరిస్థితి నెలకొంటోంది.

కొంతమందికి తల్లిదండ్రులు లేక ఇలాంటివి చేస్తుండగా మరికొంత మంది తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్ మనీతో మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారు. ఇదే కాకుండా వైట్‌నర్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. ఇవి చాలా తక్కువ ధరకు మార్కెట్‌లో లభిస్తుండటంతో వాటిని వినియోగిస్తున్నారు. చేతిలో డబ్బులు లేని సమయంలో పిల్లలు కత్తితో శరీరంపై గాట్లు పెట్టుకుంటున్నారు. చాలామంది పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఇలాంటి పనులకు అలవాటు పడి మత్తులో ఉంటున్నారు. కొంతమందికి తల్లిదండ్రులు ఉన్నా పట్టించుకోవడం లేదు. చక్కగా చదువుకోవాల్సిన పిల్లలు మత్తుకు అలవాటుపడి తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారు. దీనిపై సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకుని చిన్న పిల్లల ప్రాణాలను కాపాడి వారికి విద్యా బుద్ధులు చెప్పించి ప్రయోజకులు తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

వైదులు ఏమంటున్నారంటే...

సైకిల్ టైర్లకు పంచరు వేసే సొల్యూషన్ పీల్చితే గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు బాగా దెబ్బతింటాయని రైల్వేకోడూరు ప్రభుత్వ డాక్టర్ సాయి తెలిపారు. సొల్యూషన్‌తో ముందు గా ఊపిరితిత్తులు, తర్వాత గుండె, కిడ్నీలు దెబ్బతింటూపోతాయని వివరించారు. చిన్నపిల్లలు మత్తుకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. సొల్యూషన్‌లో పూర్తిగా కెమికల్ ఉంటుంది కాబట్టి వాటిని పిల్లలకు మార్కెట్‌లో అమ్మరాదని చెప్పారు.

చర్యలు తీసుకుంటున్నాం

మత్తుకు అలవాటుపడిన చిన్నపిల్లల సమాచారం తెలుసుకుని గుర్తించి వారిని కడప చిన్న పిల్లల సంరక్షణ కేంద్రానికి తరలించి అన్ని వసతులు కల్పించి వారికి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నాము. కలెక్టర్ల ఆదేశాలతో చిన్న పిల్లల బాధ్యతను తీసుకుంటున్నాము. ఇప్పటికే రైల్వేకోడూరులో మత్తుకు అలవాటుపడిన పిల్లలను గుర్తించాము. విద్య, రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖల అధికారులతో రైల్వేకోడూరు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పిల్లలను గుర్తిస్తున్నాము.

- జిల్లా బాలల సంరక్షణ అధికారి రామలక్ష్మీ

పిడుగుపాటుకు 47 జీవాలు మృతి

● సుమారు రూ.6 లక్షల నష్టం ● టీడీపీ నేత చంద్ర రూ.50 వేల ఆర్థికసాయం




మృతి చెందిన గొర్రెలు, పొట్టేళ్లు - బాధితురాలికి రూ.50 వేల చెక్కును అందచేస్తున్న టీడీపీ నేత దేరంగుల చంద్ర

తంబళ్లపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు 47 మూగ జీవాలు మృతి చెందిన సంఘటన తంబళ్లపల్లె మండలం బోనాసివారిపల్లెలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు..తంబళ్లపల్లె మండలం ఆర్‌ఎన్ తాండా పంచాయతీ బోనాసివారిపల్లెకు చెందిన మావెళ్ల రెడ్డమ్మ భర్త అంజనప్ప కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో ఆమె 110 వరకు గొర్రెలు, పొట్టేళ్లు మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రోజు ఎప్పటిలాగానే జీవాలను మేతకు తీసుకువెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటి వెనుక వైపు రేకుల షెడ్డులో తోలింది. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. శనివారం ఉదయం షెడ్డు వద్దకు వెళ్లి చూడగా కొన్ని జీవాలు పడిపోయి ఉండటం గమనించింది. వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులతో వెళ్లి పరిశీలించగా అందులో 47 జీవాలు మృతి చెందగా, మరో 7 జీవాలు లేవకుండా పడిపోయి ఉన్నట్లు వాపోయింది. మృతి చెందిన జీవాల విలువ సుమారు రూ.6 లక్షల పైగా ఉంటుందని బాధితురాలు వాపోయింది.

బ్యాంకులో బంగారు పెట్టి కొంత, స్థానిక రైతుల వద్ద మరి కొంత అప్పు చేసి జీవాలు తెచ్చుకుని మేపుకుంటున్నామని..ఈ ఘటనతో తాము ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా జీవనోపాధి కోల్పోయామని రెడ్డమ్మ, కుటుంబసభ్యులు భోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకుని తమకు సాయం అందించాలని బాధితులు, స్థానికులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న పశు వైద్య శాఖ ఏడీ సుమిత్ర, పశు వైద్యాధికారి విక్రమ్ రెడ్డి, పశు వైద్యురాలు ఇందు వెంటనే గ్రామానికి వెళ్లి మృత్యువాత పడ్డ జీవాలను పరిశీలించారు. కొన్నింటికి పోస్టుమార్టం నిర్వహించి అవయవాలను పరిశీలించారు. కాలేయం, గుండె తదితర అవయవాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. పిడుగుపాటుకు గురై జీవాలు మృతి చెంది ఉండవచ్చని పశువైద్యాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న తెలుగు యువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, కూటమి నేతలు గ్రామానికి చేరుకుని టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు చంద్ర తన సొంత నిధులు రూ.50 వేల చెక్కును బాధితురాలికి అందచేశారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ఉత్తమ్‌రెడ్డి, సిద్దమల్ రెడ్డి, గ్రామాధ్యక్షులు నరసింహులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, గురుమూర్తి, వార్డు సభ్యులు జగదీష్, జనసేన నేత ఎద్దుల నరసింహులు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



శాంతమ్మ(ఫైల్)

ములకలచెరువు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బైక్‌లో చీర కొంగు ఇరుక్కుని తీవ్రంగా గాయపడిన శాంతమ్మ(45) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. స్థానిక ఇందిరాకాలనీ వాసి పెయింటర్ వెంకటరమణ నాయక్ భార్య శాంతమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈ నెల 7వతేదీన తన కుమారుడు వెంట ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్లింది. అక్కడ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని తిరిగి ములకలచెరువుకు వస్తుండగా మార్గం మధ్యలో వేపూరికోట వద్ద వెనుక కూర్చున్న శాంతమ్మ చీర కొంగు బైక్ వెనుక చక్రంలో చుట్టుకుని కింద పడింది. ఈ ప్రమాదంలో శాంతమ్మ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రూయాకు తరలించారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మహిళ మృతదేహాన్ని ములకలచెరువుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మహిళ మృతితో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ బబ్లూ

ములకలచెరువు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మిస్తున్న కల్యాణమండపంలో పనిచేస్తూ కింద పడడంతో బిహార్ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో యువకుడి రెండు కాళ్ళు విరడగంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు... బిహార్‌కు చెందిన బబ్లూ (31) మదనపల్లెలో నివాసముంటూ భవనాలకు పీఓపీ పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ములకలచెరువులోని కదిరి రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న కల్యాణమండపంలో పీఓపీ పనులు చేసేందుకు వచ్చాడు. శనివారం పనిచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్య సిబ్బంది సూచనల మేరకు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన నీటి పంపింగ్



ప్రాజెక్టులోకి మోటారు దించుతున్న కార్మికులు, అధికారులు

పీలేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే క్రమంలో శనివారం పీలేరు పంచాయతీ అధికారులు మరో ముందడుగు వేశారు. కొంత కాలంగా అనేక ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి శనివారం సాయంత్రం నుంచి పీలేరు మండలం బాలంవారిపల్లె వద్దనున్న గార్గేయ ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు.

తొలి విడతలో ఒక మోటారు ద్వారా నీటిని పంపింగ్ చేసి కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లలో నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందిస్తామని డిప్యూటీ ఎంపీడీఓ లతీఫ్ ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో మరో మోటారును కూడా అమర్చుతామని, తద్వారా రెండు, మూడు రోజులకు ఒకసారి పట్టణంలో నీటి సరఫరా చేయగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేనందున ప్రస్తుతం పట్టణంలో సగటున ఎనిమిది రోజులకు ఒకసారి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లు, ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సంయుక్తంగా శ్రమించి మోటారు ద్వారా పంపింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మికులు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గాలివీడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనంలమేరకు.. మండలంలోని కొర్లకుంట పంచాయతీ పెద్ద రెడ్డివారిపల్లెకు చెందిన నిర్జీ శంకరయ్య (38) రజక వృత్తి, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు, మృతునికి నలుగురు ఆడ పిల్లలు సంతానం. కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు కడపలోని రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



సిద్దవటం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భాకరాపేట సమీపంలోని హైవే పక్కన ఉన్న గుర్తు తెలియని వృద్ధురాలు (80) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వృద్ధురాలు హైవే పక్కన పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో ఆమెను కడప రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందింది. ఆమె ఆచూకీ తెలిసినవారు ఒంటిమిట్ట సీఐ బాబు 91211 00581, సిద్దవటం ఎస్‌ఐ 91211 00584 అనే మొబైల్ ఫోన్ నెంబర్లకు సమాచారం తెలపాలని ఎస్‌ఐ రఫీ తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ర్యాలీ చేస్తున్న గిరిజన, యానాది సంఘ నేతలు, సభ్యులు

పీలేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన యానాది సేవా సంఘం, ఏపీ ఆదివాసీ ఎరుకల సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పీలేరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీలేరు ఏఎంసీ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు జానం గంగిరెడ్డి మాట్లాడుతూ అడవులు, నదులు, పర్వతాలతో కలిసి జీవించిన గిరిజనులు, యానాదులు, ఎరుకల కారణంగా గతంలో పర్యావరణ సమతుల్యత ఉండేదన్నారు. కాలక్రమంలో వారందరూ సంప్రదాయ జీవనశైలికి దూరమైన కారణంగా పర్యావరణ సమతుల్యత గణనీయంగా దెబ్బతినిందన్నారు. ప్రభుత్వాలు తమకు హామీ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను అమలు చేయాలని, అటవీ హక్కులు, విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. అంతకుమునుపు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస వర్మ, మహిళా అధ్యక్షురాలు సావిత్రమ్మ, నేతలు కిల్లా విజయ్ కుమార్, క్రాంతి కుమార్, నారాయణమ్మ, రెడ్డప్ప, ఆదినారాయణ, ఈశ్వరయ్య, లోకేశ్, రాజేశ్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదా ఐఏఎస్

కుటుంబ సభ్యులతో కలిసి రాజంపేటలో వాకింగ్



రాజంపేటలో నడుచుకుంటూ వెళుతున్న సబ్ కలెక్టర్ భావన

రాజంపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఐఏఎస్, ఐపీఎస్‌లు అంటే పెద్ద హుందాతనాన్ని పాటిస్తారు. అయితే మూడు రోజుల కింద రాజంపేట సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యువ ఐఏఎస్ అధికారి భావన ఎంతో సాదాసీదాగా కనిపిస్తున్నారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన మూడో రోజే శనివారం సాయంత్రం రాజంపేట ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి తన కుటుంబసభ్యులతో కలిసి మెయిన్‌రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండు వరకు నడుచుకుంటూ వెళ్లారు. ఆర్టీసీ బస్టాండును సందర్శించి అక్కడ పరిస్థితిని స్వయంగా ఆరా తీశారు. తిరిగి అక్కడి నుంచి నడుచుకుంటూ ఆర్అండ్‌బీ బంగ్లాకు వెళ్లారు. ఇటీవల బదిలీపై వెళ్లిన నిదియాదేవి సబ్ కలెక్టర్ కార్యాలయం ఖాళీ చేయడంలో ఆలస్యమవుతుండడంతో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన భావన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉన్నారు.

చెట్టును ఢీకొన్న ట్రాక్టర్ : ఇరువురి మృతి



చెట్టును ఢీకొన్న ట్రాక్టర్

చిన్నమండెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దమండెం ప్రధాన రహదారిలో తొగటపల్లి వద్ద ఒరిస్సాకు చెందిన విద్యుత్ వైర్లు లాగే కూలీల ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు... కరెంట్ స్తంభాలకు వైర్లు లాగేందుకు పులివెందులకు చెందిన మహేశ్ అనే కాంట్రాక్టర్ వద్ద ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుమారు 10 మంది పనిచేస్తున్నారు. శనివారం ఉదయం సంబేపల్లె నుంచి పదిమంది కార్మికులు ట్రాక్టర్‌లో వచ్చి చిన్నమండెం మండలంలోని పడమటికోన, కలిబండ గ్రామ సమీపంలో విద్యుత్ లైన్లు లాగారు. పని పూర్తయిన అనంతరం అందరూ ట్రాక్టర్‌లో సంబేపల్లెకు వెళుతుండగా తొగటపల్లె గ్రామ సమీపంలోని రాగానే ట్రాక్టర్‌కు బ్రేక్ పడకపోవడంతో సాయంత్రం 6.15 గంటలకు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గోల్కాసింగ్ (23), మజీ సింగ్ (25) బలమైన రక్తగాయాలై మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన గోల్కాసింగ్, మజీ సింగ్

మత సామరస్యానికి ప్రతీకగా రాయచోటి నిలవాలి

శాంతి కమిటీ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి రాయచోటి ప్రతీకగా నిలవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి తెలిపారు. ఈ నెల 10న ఆదివారం బీజేపీ సారథ్యంలో నిర్వహించనున్న యాత్రను దృష్టిలో పెట్టుకొని శనివారం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులతో పాటు బీజేపీ నాయకులు, ముస్లిం మత పెద్దలతో చర్చించారు. యాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేయడమే కాకుండా, కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు నాటుతున్న జిల్లా అధికారి ప్రదీప్‌కుమార్

రైల్వేకోడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని భారత యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ (నెహ్రూ యువ కేంద్రం) అన్నమయ్య జిల్లా అధికారి బి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో మై భారత్ సహకారంతో గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుదేవ వశిష్ట కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రధాని అమ్మ పేరుతో ఒక చెట్టు అనే గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రజలు విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం ద్వారా తల్లిలాంటి ప్రకృతిని కాపాడుకున్నవారమవుతామన్నారు. ఇంటి ఆవరణలో పండ్ల మొక్కలు పెంచడం ద్వారా ఇంటి అవసరాల ఖర్చు తగ్గించుకోడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు. మహిళలు ఉపాధిగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఛైర్మన్ కె.పార్థసారథి మాట్లాడుతూ పర్యావరణ అసమతుల్యత కారణంగా సమయానికి వర్షాలు పడకపోగా, ఎండలు అధికమవుతున్నాయన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడమే కాకుండా ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలన్నారు. అనంతరం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుదేవ వశిష్ట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్రజున్ను రమేష్, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు శివ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో జేసీ భోజనం



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటిటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మాసాపేట మార్కెట్ యార్డులోని అన్న క్యాంటీన్‌ను శనివారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేయడానికి వచ్చిన వారిని భోజనం బాగుందా, సౌకర్యాలు ఎలా ఉన్నాయి, పరిశుభ్రత ఎలా ఉంది వంటి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే భోజనం చేశారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం తాళలేక ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహ్యా చేసుకుంది. కోడూరు ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు కోడూరు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న యోగానంద సతీమణి ముక్కడి చిన్న రెడ్డమ్మ (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది.

దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె శనివారం ఉరి వేసుకుని మృతి ఆత్మహత్య చేసుకుంది. భర్త ఇచ్చిన సమాచారం మేరకు ఇంటికి వెళ్లి పరిశీలించి మృతదేహాని శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలి తల్లి చిన్నక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అన్నదాతకు 'ఆత్మా' చేయూత



రైతుల్లో అవగాహన పెంచేందుకు బ్యాలెట్ బాక్స్ పరీక్షను నిర్వహిస్తున్న ఆత్మా బ్లాక్ టెక్నాలజీ మేనేజర్



వరిలో కాలిబాటలు తీసే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

● క్రియాశీలకంగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ● శాస్త్రీయ పద్ధతులకు రూ.59.5 లక్షలు

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు సాగులో సాంకేతికతను చేరువ చేసే దిశగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. సాగు రంగానికి సమన్వయంగా రైతన్నలకు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఆత్మాకు మోక్షం లభించింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని గాలికి వదిలేసింది. గడిచిన అయిదేళ్లల్లో ఒక్కపైసా నిధులు చేయకుండా నిర్వీర్యం చేసింది. ఆత్మాను బలోపేతం చేసి వ్యవసాయ రంగ శాస్త్రీయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ఆధునిక సాగు పద్ధతుల విస్తీరణకు కూటమి ప్రభుత్వం ఉమ్మడి కడప జిల్లాకు రూ.59.5 లక్షలు నిధులు మంజూరు చేసింది.

కడప జిల్లాలో 8, అన్నయ్య జిల్లాలో 4 వ్యవసాయ బ్లాక్‌లుగా కేటాయించారు. మంజూరైన నిధులతో ఆయా అధికారులు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధునాతన సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పెట్టుబడులను తగ్గించడం, నూతన యత్ర పరికరాలు అయిన డ్రోన్ వంటి వాటి గురించి వివరిస్తారు. ప్రధాన పంటల గురించి క్షేత్ర స్థాయిలో ప్రదర్శనలు, విజ్ఞాన యాత్రలు, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనకు మార్కెటింగ్, తెగుళ్ల, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యంపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. ఈ పథకంలోని బ్లాక్ టెక్నాలజీ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రైతులను చైతన్యపరుస్తూ వారిలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నారు. సాగు విధానంలో నూతన ఒరవడిని, అధ్యయనాన్ని వివరిస్తూ అన్నదాతల చైతన్యం కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

రైతన్నకు సాంకేతిక పరిజ్ఞానం

వ్యవసాయ డివిజన్ల పరిధిలో సాగులో ఉన్న రైతులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. రైతుకు ఆధునిక పద్ధతులను వివరిస్తూ సాగు విధానంపై శిక్షణ కల్పిస్తాం. పొలంబడి, విజ్ఞానయాత్ర, కిసాన్‌మేళా తదితర కార్యక్రమాలతో పక్కా కార్యాచరణ ప్రణాళికతో ఆత్మాను ముందుకు నడిపిస్తాం.



- ఎస్.విజయలక్ష్మి, పీడీ, ఆత్మా

పాలకొండ్రాయ స్వామికి బంగారు నామాల బహూకరణ



బంగారు నామాలను అందజేస్తున్న సగబాల పార్వతమ్మ కుటుంబీకులు

కడప కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన సగబాల పాలకొండ్రాయుడు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పార్వతమ్మ కడప నగరానికి సమీపంలోని పాలకొండపై వెలసిన పాల కొండ్రాయ స్వామికి సుమారు మూడు తులాల బంగారు నామాలను బహూకరించారు. శ్రావణమాస మూడు శనివారం పాలకొండలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగబాల పాలకొండ్రాయుడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు స్వామివారికి సుమారు రూ.4లక్షల విలువైన బంగారు నామాలు, పట్టు వస్త్రాలు ఆలయ ఈవో శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు యోగి ద్వారా అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం

బ్రహ్మంగారిమఠం ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీమాత ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. శనివారం స్థానిక కన్యకాపరమేశ్వరీ అమ్మవారిశాల అధ్యక్షుడు బన్నూరి క్రిష్ణమూరి కుటుంబసభ్యులు రూ.1,00,116లు, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు ఆర్యవైశ్య అన్నదాన సత్రం, అమ్మవారిశాల కమిటీ మెంబర్ ముచ్చర్ల శేషయ్య కుటుంబసభ్యులు రూ.1,00,116లు మఠాధిపతులు వీరశివకుమార్ స్వామికి అందజేశారు. దాతలను శివకుమార్‌స్వామి శాలువ, పూలమాలతో సన్మానించారు.

మలేరియా రహిత జిల్లాగా చేద్దాం



సుగాలి బిడికిలో దోమల నివారణ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, వైద్య సిబ్బంది

రామాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాను 2027 నాటికి మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ సచివాలయ పరిధిలో శనివారం దోమల నివారణ (ఏసీయం) స్ప్రేయింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటిలో దోమల నివారణ మందు తప్పనిసరిగా స్ప్రే చేయించుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించి దోమల వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో సాయంత్రం వేళల్లో వేపాకు పొగ పెట్టడం వల్ల దోమలను నివారించుకోవచ్చని తెలిపారు. స్ప్రే నిర్వహణపై స్టేట్ కన్సల్టెంట్ కొండారెడ్డి విజయవాడ నుంచి వీడియో కాల్ ద్వారా పర్యవేక్షించి సాంకేతిక సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ క్రిస్టఫర్, ఆశ కార్యకర్తలు, స్ప్రే కాంట్రాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునగౌడ్

కడప మారుతీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రీషియన్‌లో గల హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని హరితహోటల్ జిల్లా డీవీఎం మల్లికార్జునగౌడ్ కోరారు. శనివారం స్థానిక హరితహోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల అధ్యాపకులు ఎస్.శివరామకృష్ణ చౌదరితో కలిసి ఆయన మాట్లాడారు. ఇందులో మూడు సంవత్సరాల బీఎస్సీ (హెచ్‌ఎండ్ హెచ్‌ఏ) డిగ్రీ కోర్సులో ఇంటర్‌లో 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇదిలా వుండగా క్రాఫ్ట్ కోర్స్ ఇన్‌ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సు, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్‌కు పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఈ కోర్సులలో 5 నెలలపాటు వివిధ రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి.. ఒక నెల ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారన్నారు. కోర్సుల కాలం పూర్తికాగానే ఏపీ రాష్ట్ర పర్యాటకశాఖ హోటల్స్, ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. అర్హులైన యువతీ, యువకులకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం కలదన్నారు. మరింత సమాచారం కోసం 9701343846, 9100558006, 9502113163 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 13వ తేదీ లోపు తిరుపతిలో గల కళాశాలకు పంపించాలని కోరారు.

ఉప ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పులివెందులలో 500 మందిపై బైండోవర్ కేసు ● ఎస్పీ అశోక్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

పులివెందుల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్పీ వచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీకి ఉప ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా పులివెందుల మండలంలో 9 చోట్ల ఓటింగ్ సాగుతుందన్నారు. ఇక్కడ అవసరమైన అన్ని ఏర్పాట్లను పరిశీలించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా దాదాపు 500మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. రౌడీషీటర్లపై, ఓటర్లను కావాలనే ఇబ్బంది పెట్టాలనుకునే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం 48 గంటల ముందు ప్రచారాలు ముగించాలన్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు హోటళ్లు, లాడ్జిలలో ఉండేవారిపై వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. వెహికల్స్‌లో తిరిగే వారిపై కూడా వివరాలు సేకరిస్తున్నామన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత ఎన్నికలు జరగడమే ఏకైక లక్ష్యంగా ఏర్పాట్లు సాగించామన్నారు. పులివెందుల మండలంలో తొమ్మిది ప్రాంతాలలో ఓటింగ్ సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలతో భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటింగ్ జరుగుతున్న సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో చిత్రీకరణ, కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కూడా జరుగుతుందన్నారు.

గండి క్షేత్రానికి వెళ్తుండగా.. ఆటోను ఢీకొట్టిన కారు

ఒకరు మృతి... కుటుంబ సభ్యులకు గాయాలు





మృతి చెందిన పుల్లయ్య, నుజ్జునుజ్జు అయిన ఆటో

వేంపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం చేసుకునేందుకు ఓ కుటుంబం గండి క్షేత్రానికి ఆటోలో వెళుతుండగా ప్రమాదం సంభవించి ఒకరు మృతి చెందగా.. మరి కొందరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వెలమవారిపల్లె గ్రామానికి చెందిన గండ్లూరు పుల్లయ్య (55), కుమారుడు వలి, కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం ఆటోలో గండికి బయలుదేరారు. మార్గమధ్యలోని నందిపల్లె సమీపంలో పులివెందుల-వేంపల్లె ప్రధాన రహదారిలో వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఆటోను వేగంగా ఢీకొంది. దీంతో ఆటో చెట్టుకు ఢీకొని నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో పుల్లయ్య తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తీసుకెళుతుండగా మృతి చెందాడు. కుమారుడు వల్లి, మనువడు, మనువరాలు నయాన్, మెహరీన్‌లకు గాయాలయ్యాయి. వీరిని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. పుల్లయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో ఉంచారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'గిరిజనులపై దాడికి తెగబడిన అగ్రకులాల వారిని అరెస్ట్ చేయాలి'

కడప మారుతీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బాకీ వున్నారనే నెపంతో వేంపల్లి టౌన్ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గిరిజన (ఎరుకల) కులానికి చెందిన ఎన్. వెంకట లక్షుమ్మతో పాటు ఈమె తల్లి రామలక్షుమ్మలను కారులో బలవంతంగా తీసుకెళ్ళి దాడికి పాల్పడిన వారిని తక్షణం పోలీసులు అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెనుగొండ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎర్రముక్కపల్లెలో గల ఏఐవైహెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామలక్షుమ్మ పెద్ద కుమార్తె గంగాదేవికి రూ.40 లక్షలు అప్పుగా ఇస్తే.. చెల్లించకుండా కాలయాపన చేస్తున్నదంటూ సదరు ప్రాంతానికే చెందిన వరప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, నాగార్జున, వీరి అనుచరులు మహిళలను వారి ఇంటి నుంచి కారులో తీసుకెళ్లి వివిధ ప్రాంతాలలో పది రోజులపాటు చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. కాగా ఆ మహిళలు నివాసం వున్న ఇంటి పేపర్లు, వ్యక్తిగత బాండ్లు, తీసుకు వచ్చి తిరిగి ప్రామిసరీ నోట్లపై కుటుంబసభ్యులతో సంతకాలు తీసుకురావాలంటూ హుకుం జారీ చేశారన్నారు. ఈ విషయాన్ని బట్టబయలు చేస్తే చంపేస్తామని బెదిరించడం బాధాకరమన్నారు.

ఈ విషయంపై జిల్లా ఎస్పీకి గత మే నెల 26న ఫిర్యాదు చేశామన్నారు. అంతేకాకుండా రాష్ట్ర హోంమంత్రికి, ట్రైబల్ మంత్రికి రాతపూర్వకంగా ఇచ్చినట్లు స్పష్టం చేశారు. వీరితో పాటుగా వేంపల్లి పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు కాపీని ఇచ్చామన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా వారిపై కేసు నమోదు చేశారే కానీ ఇప్పటి వరకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన డీఐవో



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఐవో ఉమామహేశ్వరరావు

కడప కలెక్టరేట్/ బద్వేలు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రవేట్ ఆసుపత్రులను సోమవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రులలో ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్, పొల్యూషన్, ధరల పట్టికల ప్రదర్శన, నీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, రికార్డులు పరిశీలించారు. ముఖ్యంగా అర్హత గల వైద్య సిబ్బంది ఉన్నారా? లేదా? అనే విషయాలను ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఐవో హెచ్చరించారు.

బద్వేలులో...: పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను శనివారం ఆర్‌బీఎస్‌కే జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రమేష్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు, చెక్‌లిస్ట్‌లో పేర్కొన్న ప్రమాణాల అమలు పరిస్థితిని, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, సూపర్‌వైజర్ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యశాఖ అధికారులు

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ.. తప్పిన ప్రమాదం



కొండాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పట్టణంలో శనివారం ఓ లారీ డివైడర్‌పైకి దూసుకొచ్చింది. లోడుతో తాడిపత్రి వైపునకు వెళుతున్న లారీ ఒక్కసారిగా డివైడర్‌పై దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డివైడర్‌పై ఉన్న బారికేడ్లు, లారీ ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది.

ఒకే చోట సీహెచ్‌సీ, పీహెచ్‌సీ

● పల్లెలకు అందని వైద్యసేవలు ● ఇబ్బందులు పడుతున్నగ్రామీణ ప్రజలు

చెన్నూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతప్రజలకు వైద్యసేవలు అందని ద్రాక్షలా మారాయి. మండల కేంద్రంలో ఒకేచోట సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో దూర ప్రాంత ప్రజలు వైద్య కోసం రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలైన కైలాసగిరికోన, ఎస్టీ రామాపురం కాలనీ, దౌలతాపురం ఎస్టీ కాలనీ, గుర్రంపాడు ప్రాంత ప్రజలు వైద్యసేవలు పొందాలంటే ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూరులో దాదాపు 60 ఏళ్ల క్రితం ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో మండల జనాభా పెరగడంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చారు. అయితే ప్రతి మండల కేంద్రానికి సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తప్పకుండా నిర్మించాలి. అయితే చెన్నూరులోని విలేజ్ క్లినిక్‌నే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చారు. అంతకు ముందు సామాజిక ఆరోగ్య కేంద్ర భవనంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ఉండేది. వైద్యం కోసం వచ్చిన ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లకుండా సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లడంతో అక్కడ ఓపీ విభాగంలో వత్తిడి ఎక్కువ అయ్యింది. ఎట్టకేలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఈ విషయం వైద్యవిధానపరిషత్‌కు తెలిపి సీహెచ్‌సీ భవన నుంచి పీహెచ్‌సీ భవనాన్ని వేరు చేస్తూ విలేజీ క్లినిక్‌లో పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. అయితే రెండు కూడా మండల కేంద్రంలోనే కొనసాగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాలకు అందని వైద్యసేవలు

మండల కేంద్రంలోనే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఉండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కైలాసగిరి కోన, ఎస్టీరామాపురం కాలనీల ప్రజలు రాత్రివేళ, అత్యవసర పరిస్థితులో దాదాపు ఆరేడు కి.మీ దూరం నుంచి మండల కేంద్రానికి రావాలంటే.. వారి అవస్థలు వర్ణనాతీతం. వైద్యశాఖ అధికారులు ఈ విషయం పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోవడంతో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామని చెప్పిన పప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో సీహెచ్‌సీ, పక్క గ్రామాల్లో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.





చెన్నూరులోని సీహెచ్‌సీ భవనం, పీహెచ్‌సీ భవనం

వేడుకగా అంజన్నకు శ్రావణమాస పూజలు


ఏటిగడ్డ అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఏటిగడ్డన వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో శనివారం పురస్కరించుకుని విశేష పూజలను నిర్వహించారు. శ్రావణమాసం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజ, తోమాల, వడమాల కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారి ఊరేగింపును తిలకించేందుకు పీటీఎం సహా సమీప గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రాము, సాయి, రమేష్, శేఖర్, చిన్నరెడ్డెప్ప, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కలకడ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లె పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఉదయాన్నే వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజరి రామయ్య అభిషేకం, ఆకు పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించి దర్శన భాగ్యం కల్పించారు. పలువురు భక్తులు భజనలు చేశారు. సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. దాతలు అన్నదాన వితరణ గావించారు.

మదనపల్లెలో వైభవంగా పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో వరాల అంజన్న, గోవర్దన గిరి క్రిష్ణుడు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): మదనప ల్లె పట్టణంలో శని వారం వైభవంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని పలు ఆలయాలు జనాల తో కిటకిటలాడా యి. ముఖ్యంగా దే వళంవీధిలోని ప్ర సన్న వేంకటరమణస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా భక్తుల సందడి నెల కొంది. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. ఉదయా న్నే స్వామివారిని ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలను ఈఓ రమణ పర్యవేక్షించారు. మల్లికార్జున సర్కిల్ సమీపంలోని వరాల ఆంజనేయస్వామిని కాయలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనపగుట్టలో గోవర్ధన గిరిలో వెలసిన శ్రీకృష్ణాలయంలో స్వామివార్లకు విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాభిషేకం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయకమిటీ సభ్యులు అందజేశారు. ఆలయం నుంచి అనపగుట్ట, అమ్మచెరువుమిట్ట మీదుగా ప్రదక్షణలు చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం


సంఘీభావం ప్రకటిస్తున్న నూర్‌బాషా సంఘం నేతలు

కలికిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అనుబంధ విభాగాలతో సమన్వయం చేసుకుని నూర్ బాషా దూదేకుల సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని ఆ సంఘం ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పగడాల సిద్దయ్య సూచించారు. పీలేరు డివిజన్ స్థాయి సంఘం ఆధ్వర్యంలో శనివారం కలికిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూర్‌బాషా ఉద్యోగులతో మండల, డివిజన్, జిల్లా స్థాయి సంఘాలను ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించాల్సి వుందన్నారు. కింది స్థాయిలో సంఘాల ఏర్పాటుకు ఐకమత్యంగా ప్రయత్నించాలన్నారు. సెప్టెంబరులో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. నూర్‌బాషా దూదేకులకు ఆర్థికంగా, రాజకీయంగా ప్రోత్సాహం కొరవడిందని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, పీలేరు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రహమత్ బాషా, పాలగిరి ఖాదర్‌వలీ, ఉపాధ్యాయులు అజంతుల్లా, ఖాదర్‌వల్లీ, ఖాదర్ సాహెబ్, జాకీర్ పాల్గొన్నారు.

జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి నరసింహులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీపీఎం అన్నమయ్య జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పిలుపునిచ్చారు. శనివారం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రెండో మహాసభలు మదనపల్లె జరుగుతాయని, నేటి నుంచి మూడు రోజులు సీపీఐ మహాసభలు ఘనంగా నిర్వహించబోతున్నామన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు హరినాథ్‌రెడ్డి, ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, శివారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం మిషన్ కాంపౌండ్ నుంచి రెండు గంటలకు ప్రదర్శన ప్రారంభమై బెంగళూరు బస్టాండ్, అనిబీసెంట్ సర్కిల్, శ్రీకృష్ణాథియేటర్ వరకు ప్రదర్శన జరుగుతందన్నారు. సోమ, మంగళవారం శేషసాయి కల్యాణ మండపంలో సభలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళీ, మాధవ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం.. ప్రజల పక్షం...


కరపత్రాలను పంచుతున్న ఆర్జే వెంకటేష్ తదితరులు

నిమ్మనపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల పక్షాన నిలిచారని రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ అన్నారు. శనివారం రాచవేటివారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారి పల్లిలో టీడీపీ ఏడాది పాలనలో చేపట్టిన సుపరిపాలన తొలిఅడుగులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను సగానికి పైగా నెరవేర్చామన్నారు. వైసీపీ కార్యకర్తలు ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారు కూడా ప్రభుత్వ పథకాలు అందుకున్నవారిలో వున్నారని గుర్తుచేశారు. గ్రామ అధ్యక్షుడు మల్లికార్జున, నేతలు శంకర, చెన్నం రాజశేఖర్, వంశీ, గాజుల వెంకటరమణ, రవి, శివకృష్ణ, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నీరుగారింది

ఉన్నతాశయం - నిరుపయోగం - నిర్వీర్యం ● డంపింగ్ యార్డుల తీరు ఇది ● ఫలితం శూన్యం


దుస్థితికి చేరుకున్న డంపింగ్ యార్డు

వాల్మీకిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. ఎంతో ఉన్నతాశయంతో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. లక్షలు వెచ్చించి యార్డులు నిర్మించినా ఫలితం శూన్యమైంది. పనుల కోసం చేపట్టిన ఉపాధి పనులు నిర్వీర్యమయ్యాయని చెప్పవచ్చు. వివరాల్లోకెళితే....

చెత్త సేకరణతో కొందరికైనా ఉపాధి దొరుకుతుందని వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో సైతం చెత్త సేకరణకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.3 లక్షలు పైమాటగానే నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. ఇందులో చెత్తను సేకరించి శుద్ధి చేసే పనులు పట్టణంలో మినహా ఎక్కడా కనిపించలేదు. వైసీపీ ప్రభుత్వంలో నేతల అనుయాయులు లబ్ధి పొందేలా చూశారే తప్ప ప్రజల కోసం పనులు చేసిన దాఖలాలు కన్పించలేదని చెప్పవచ్చు. ఉపాధి ద్వారా డంపింగ్ యార్డుల నిర్మాణాలు చేపట్టి సొమ్ము చేసుకున్నారే తప్ప వాటిని ఉపయోగించాలన్న విషయాన్ని సైతం విస్మరించారు. మండలంలోని టి.సాకి రేవుపల్లెలో నిర్మించిన డంపింగ్ యార్డు భవనాల పైకప్పు రేకులు, తలుపులు, కిటికీలు సైతం దొంగలించుకెళ్లడం గమనార్హం. ఈ విషయమై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఏళ్లు గడుస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. మాధవరంపల్లె డంపింగ్ యార్డు దిష్టిబొమ్మలా తయారైంది. కూరపర్తి, విఠలం, తదితర గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు మందుబాబులకు ఆవాసాలుగా మారాయే తప్ప ప్రయోజనం శూన్యమనే చెప్పాలి. ప్రభుత్వం ఎంతో కృతనిశ్చయంతో, అభివృద్ధి ధృక్పథంతో నిర్మించిన డంపింగ్ యార్డులు ఇకనైనా వినియోగంలోకి తెస్తే ఆశయం సిద్ధిస్తుందనే చెప్పాలి. వాల్మీకిపురం మినహా ఏ ఒక్కచోట కూడా డంపింగ్ యార్డుల నిర్వహణ కొనసాగక పోవడం గమనార్హం. ఎంపీడీఓ మనోహర్ రాజును వివరణ ఇస్తూ తప్పక పరిశీలించి చర్యలు తీసుకుంటామని, డంపింగ్ యార్డుల నిర్వహణ, చెత్తసేకరణపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తామన్నారు.


టి.సాకిరేవుపల్లె డంపింగ్‌యార్డు దుస్థితి - మాధవరంపల్లెలో నిరుపయోగంగా డంపింగ్ యార్డు


విఠలం వద్ద మందుబాబులకు అడ్డాగా...

తంబళ్లపల్లెలో 30.4 మి.మీ వర్షపాతం


తంబళ్లపల్లె-పెద్దమండ్యం రోడ్డుకు అడ్డంగా కూలిన వృక్షం

తంబళ్లపల్లె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 30.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ లక్ష్మీప్రసాద్ తెలిపారు. తంబళ్లపల్లెలో మూడు, నాలుగు రోజులుగా సాయంత్రం, రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి తంబళ్లపల్లె-పెద్దమండ్యం ప్రధాన రహదారిలో కొటాల సంత సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఓ భారీ వృక్షం కూలి రోడ్డుకు అడ్డుగా పడింది. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు స్తంభించి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు చెట్టు రోడ్డుపై అలాగే ఉండడంతో ఆ మార్గం గుండా నడిచే బస్సు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి అడ్డంగా పడిన చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మహిళలకు చీరల పంపిణీ


మహిళకు చీర అందజేస్తున్న గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్

మదనపల్లె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): భారతీయ కుటుంబ విలువలు, అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ఆత్మీయ, అనురాగాలకు ప్రతీకగా చేసుకునే రాఖీ పండుగ పురస్కరించుకుని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక కమ్మవీధిలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్‌కు మహిళలు రాఖీలు కట్టి అభిమానం చాటితే వారికి బహుమతిగా చీరలు అందజేశారు. జనసేన నేతలు అడపా సురేంద్ర, సనావుల్లా, గజ్జల రెడ్డెప్ప, రేనూరు బాబు, గడ్డం లక్ష్మీపతి, సి.చంద్రశేఖర్, కావలి రెడ్డెమ్మ, వి.నాగరాజు, ఎం.అర్జున్, పద్మావతి, జనార్దన్, నాగవేణి, మల్లిక, జి.గోపాలకృష్ణ, ఎల్.కిరణ్‌కుమార్‌రెడ్డి, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే సతీమణి


నల్లారి తనూజా రెడ్డికి వాసవీ అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

పీలేరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి శనివారం ఆలయాల్లో మొక్కు తీర్చుకున్నారు. తొలుత స్థానిక మల్లెల గ్రౌండ్స్‌లో ఉన్న అభీష్ట సిద్ది మహాగణపతి ఆలయాన్ని సందర్శించి అక్కడ 101 కొబ్బరి కాయలు సమర్పించి మొక్కు చెల్లించారు. అనంతరం నెహ్రూ బజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మొక్కు తీర్చుకున్నారు. ఆయా ఆలయాల నిర్వాహక కమిటీ సభ్యులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆమెకు అమ్మవారి చిత్రపటాన్ని కానుకగా అందజేశారు. ఆమె వెంట టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నవోదయలో మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ గీత

మదనపల్లె టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం నవోదయ ప్రిన్సిపాల్ గీత, తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి వైద్యులు ఏవీ చైతన్యబాబు సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 500 మంది విద్యార్థులకు ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, జనరల్ ఫిజీషియన్లతో పరీక్షించి, అవసరమైన వారికి చికిత్స అందించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం వున్న వారికి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసుల అభివృద్ధికి కృషి చేద్దాం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసుల అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, గిరిజన సంఘం నేత బొజ్జప్ప పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివాసులను ఆదుకోవాలని, విద్యార్థులకు, వ్యాపారులకు బ్యాంకు రుణాలు ఇచ్చేలా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. గిరిజన నేతలు పివిరమణ, కిల్లా నాగరాజు, వేమనారాయణ, విశ్వనాథ్,రమణ, వసంత, ప్రకాష్, రామాంజులు, పాల్గొన్నారు.

రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ పర్యటన

మదనపల్లె అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఏపీ రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ జనాబ్ హజ్ హసన్‌బాషా శనివారం నియోజకవర్గంలో పర్యటించారు. కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి షేక్ అయూబ్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు టీడీపీకి వెన్నుదన్నుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి, మహిళ సంక్షేమానికి కృషి చేయాలన్నారు. జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పఠాన్ మహబూబ్ ఖాన్, సయ్యద్‌సాబ్, షఫ్రక్ హనీఫ్, నజీర్ జబివుల్లా, సయ్యద్ అష్ఫల్ పాల్గొన్నారు.

హార్సిలీ హిల్స్‌లో కలిసిన బి.కొత్తకోట నేతలు....


హజ్‌కమిటీ చైర్మన్ హసన్‌బాషాతో టీడీపీ మైనార్టీ నేతలు

బి.కొత్తకోట, ఆగస్టు(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లో రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ షేక్ హసన్‌బాషా శనివారం పర్యటించారు. హిల్స్‌పై చూడదగ్గ ప్రదేశాలను తిలకించి, చల్లని వాతావరణాన్ని ఆస్వాదించారు. డైరెక్టర్ మదనపల్లెకు చెందిన పఠాన్ ఖాదర్‌ఖాన్, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత ముదివేడు అయూబ్, బి.కొత్తకోటకు చెందిన ఎండీ మస్తాన్, నాసిర్‌హుసేన్, పీటీఎం మైనారిటీ నేత సికిందర్ ఆయనను కలిసి సత్కరించారు.

వాన వస్తే.. వెళ్లేదారేదీ...?


రైల్వే అండర్ పాసింగ్‌లో నిలిచిపోయిన వర్షపు నీరు

ములకలచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వానొస్తే ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదు. రాజీవ్ కాలనీకి వెళ్లే రోడ్డులో రైల్వే అండర్ పాసింగ్ నిర్మించారు. వర్షం వస్తే చాలు కింది భాగంలో వర్షపు నీరు వెళ్లే మార్గం సరిగా లేక పెద్ద ఎత్తున నీరు చేరుతుంటోంది. ఈ మార్గం గుండానే పాత ములకలచెరువుకు ప్రజలు రాకపోకలు సాగిస్తారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి పెద్ద ఎత్తున నీరు నిలిచి ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. కాలినడకన వెళ్లే వారి పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అంకిశెట్టిపల్లె నల్లగుట్టపై అనుమతులు లేవు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అంకిశెట్టిపల్లె గ్రామంలోని నల్లగుట్ట ప్రభుత్వ భూమి అని ఇందులోకి ఎవరికీ ప్రవేశం ఉండదని శనివారం మదనపల్లె తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డి, తాలుకా సీఐ కళా వెంకటరమణ సంయుక్తంగా ప్రకటించారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే అంకిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామ సర్వేనెంబరు 15లో స్థలం పూర్తిగా ప్రభుత్వానిదని, అక్కడ ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఆ స్థలంలో రెవెన్యూ అధికారులు చుట్టూ కంచె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొందరు సామాజిక మధ్యమాల్లో ఇటీవల ప్రచారం చేస్తూ 23న నల్లగుట్టలో గౌతమబుద్ధుడి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని ఇది సరికాదని, ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ఉన్నతాధికారులు అనుమతి తీసుకోవాలన్నారు. అక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రైవేట్ వ్యక్తులకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పీలేరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బాలికల గురుకుల పాఠశాల పీలేరులో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లోకేశ్వరి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 5, 6, 7వ తరగతుల్లో 74 సీట్లు ఉన్నాయని తెలిపారు. మిగులు సీట్ల ప్రవేశ పరీక్ష నిమిత్తం దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఆశక్తి గల విద్యార్థులు 14వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు విద్యార్థుల ఆధార్, స్టడీ సర్టిఫికెట్, తల్లి దండ్రుల వార్షిక ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలతో బాలికల గురుకులంలో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. 5వ తరగతిలో ఓసీ-11, బీసీ-3, ఎస్సీ-1, ఎస్టీ-5 సీట్లు ఉన్నాయని చెప్పారు. 6వ తరగతిలో ఓసీ-16, బీసీ-9, ఎస్సీ-5, ఎస్టీ-3 సీట్లు, 7వ తరగతిలో ఎసీ-8, బీసీ-4, ఎస్సీ1, ఎస్టీ-2 సీట్లు ఉన్నట్లు తెలిపారు. వివరాలు నమోదు చేసుకున్న వారికి 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులను చేర్చుకుంటామన్నారు.

ఘనంగా గాయత్రి పూజ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం ఎగువ కురవంకలో శంకర బ్రాహ్మణ సహకార సేవా సమితి ఆధ్వర్యంలో గాయత్రి మాత పూజ నిర్వహించినట్లు ఆ సమితి అధ్యక్షుడు కోదండరామయ్య తెలిపారు. ఉదయం ఉపాకర్మ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి పూజలో పాల్గొన్నారు. కార్యకమంలో శ్రీనివాసులురావు, గౌరవాధ్యక్షుడు కామకోటి ప్రసాదరావు, నాగభూషణం, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన నాగరాజ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పుంగనూరు వాసి నాగరాజ(25) గుడిసివారిపల్లె వద్ద ఎలక్ట్రికల్ పని చేసుకుని తిరుగు ప్రయాణంలో పుంగనూరుకు వెళ్తుండగా మార్గమధ్యలో ఇసుకనూతనపల్లె క్రాస్ వద్ద కారును వెనుకవైపు నుంచి డీకొట్టి గాయపడ్డారు. స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలుకా సీఐ వెంకటరమణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్‌గా బి.గోపాల్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. డీఐజీ కోయప్రవీణ్ చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల నుంచి గోపాల్‌రెడ్డిని బి.కొత్తకోట సీఐగా బదిలీ చేశారు. ఇక్కడ సీఐగా పనిచేసిన జీవన్‌గంగనాథ్ బాబును నంద్యాల వీఆర్‌కు పంపారు. బాధ్యతలు చేపట్టిన సీఐ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌లో శాంతిభద్రతల పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు.

ములకలచెరువు సీఐగా వెంకటేశులు

ములకలచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీఐగా వెంకటేశులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న లక్ష్మన్నను కలకడకు బదిలీ చేశారు. దీంతో తిరుపతిలో విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశులును ఇక్కడి బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

కలికిరి సీఐగా...

కలికిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరుగా అనిల్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కలకడ సర్కిల్‌కు చెందిన అనిల్ కుమార్‌ను ఖాళీగా వున్న కలికిరి సీఐ పోస్టులో నియమిస్తూ 6న ఆదేశాలు జారీ చేశారు. కాగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న కె.రెడ్డిశేఖర్ రెడ్డిని కర్నూలు డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ కావడంతో ఆయన అదే రోజు నుంచి రిలీవ్ అయి వెళ్లిపోయారు.

మత్తుకు దూరంగా వుంటేనే బంగారు భవిష్యత్తు

మదనపల్లె టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మత్తుకు దూరంగా వుంటనే ప్రజలకు బంగారు భవిష్యత్తు వుంటుందని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలులో జైలు సూపరింటెండెంట్ టీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్‌శాఖ కేర్ కమిటీ సమావేశంలో రిమాండ్ ఖైదీలతో ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ మధ్యపానం, గంజాయి తదితర మత్తుఇచ్చే పదార్థాలతో మనిషి విచక్షణ కోల్పోతారని, ఫలితంగా నేరాలు చేసి జైలు జీవితం గడపాల్సి వస్తోందన్నారు. యోగా, ధ్యానంతో మత్తు విమోచన పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జేర్కాస్, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన చెట్టు తొలగింపు

ములకలచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దేవళచెరువు సమీపంలో రోడ్డుకు అడ్డుగా పడిన చెట్టును శనివారం తొలగించారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రామానికి సమీపంలో ఓ చింతచెట్టు రోడ్డుకు అడ్డుగా పడింది. దీంతో దేవళచెరువు నుంచి తంబళ్లపల్లెకు వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, టీడీపీ నేతలు శ్రీనివాసులు, ఎర్రంరెడ్డి తదితరులు రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టును శనివారం ఉదయం ఎక్స్‌వేటర్ సహాయంలో తొలగించి రాకపోకలు పునరుద్దరించారు.

దొరా... సమస్య తీరే 'మార్గ'మేదీ..?!

● 30ఏళ్లుగా రోడ్డు కోసం నిరీక్షణ

నిమ్మనపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మా సమస్య తీరే మార్గంలేదా అని చలిమామిడి హరిజనవాడ వాసులు అధికారులను కోరుతున్నారు. చలి మామిడి హరిజనవాడకు ప్రధాన రహదారి నుంచి దాదాపు కిలో మీటరు దూరం వుంది. దళితవాడలో దాదాపు 60 కుటుంబీకులు జీవిస్తున్నారు. అయితే రోడ్డు కోసం దాదాపు 30 ఏళ్లుగా నిరీక్షించి అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగి అర్జీలు సమర్పించినా ఇప్పటి వరకు రోడ్డు వేసిన పాపానపోలేదు. ఎన్నికల సమయంలో మాత్రం ఓట్ల కోసం తిరిగిన ప్రజా ప్రతినిధులు తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తారు రోడ్డు వేయిస్తామని గొప్పగా ప్రకటించుకుని ఓట్లు దండుకున్నారని వాపోయారు. దళిత గ్రామం కాబట్టే 30ఏళ్ల అయినా తమపై ప్రభుత్వాలకు కనికరంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణం నుంచి గ్రామానికి వెళ్లాలంటే శవాలను పూడ్చిన పక్కగా ఉన్న రోడ్డు గుండా వెళ్లాల్సి వస్తోంది. వర్షం వస్తే రోడ్డు మొత్తం గుంతలమయమై రొచ్చురొచ్చుగా మారుతుంది. అధికారులు, ఎమ్మెల్యేకు వినతులు సమర్పించినా ఫలితం లేదన్నారు. రోడ్డులేని చలిమామిడిహరిజన వాడకు రోడ్డు వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.